# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

www.janasakthionline.com


లోపలి పేజీల్లో...


- అమెరికా గూఢచారి రాబర్ట్ బాయర్‌తో ముఖాముఖి
- తోసుకువస్తున్న హిందూ మతతత్వశక్తుల దౌర్జన్యపూరిత ఎజెండా
- ప్రజా వ్యతిరేక విధానాల అమలులో దొందూ దొందే!
- కమ్ముకొస్తున్న దుర్భిక్షం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం
- పెన్షను పథకంలో మార్పులు : ప్రజాకర్షక పథకాల బూటకత్వం



సంపుటి : 47 సంచిక : 12 విజయవాడ 20-10-2014 పేజీలు : 8 వెల : రు 5.00


## హుధూద్ తుఫాను తాకిడికి సర్వస్వం కోల్పోయిన ఉత్తరాంధ్ర, తూర్పుగోదావరి జిల్లాల రైతాంగానికి, మత్స్యకారులకు, ఆదివాసులకు, నిరుపేద ప్రజానీకానికి ప్రథమ ప్రాధాన్యతలో ప్రభుత్వం తక్షణం సహాయ సహకారాలు అందించాలి

ఈ నెల 12వ తేదీన హుధూద్ తుఫాను విశాఖ వద్ద తీరం దాటింది. దీని ధాటికి ఇటు విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి జిల్లాలతోపాటు అటు దక్షిణ ఒడిషా ప్రాంతమంతా విధ్వంసానికి గురైంది.

తుఫాను తీవ్రత గురించిన ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో మానవ ప్రాణ నష్టాన్ని తగ్గించగలిగినా (తాజా సమాచారం ప్రకారం మృతుల సంఖ్య 40గా ప్రభుత్వం ప్రకటిస్తోంది.) పంటలకు, ప్రజల, ప్రభుత్వ ఆస్తులకు, రోడ్లు, రైల్వే, విద్యుత్తు తదితర మౌలిక సదుపాయాలకు భారీనష్టం వాటిల్లింది. పంట చేలన్నీ నీటమునిగాయి; తోటలన్నీ నాశనమయ్యాయి; వేలాదిగా పశువులు మరణించాయి; కోళ్ళ ఫారాలలో లక్షలాదిగా కోళ్ళు మృత్యువాత పడ్డాయి. 200 కి.మీ. పైగా వేగంతో వీచిన పెనుగాలులకు లక్షలాదిగా చెట్లు కూకటివేళ్ళతో సహా నేలకూలాయి. వేల సంఖ్యలో విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. మత్స్యకారుల పడవలన్నీ ధ్వంసమయ్యాయి. ముఖ్యంగా నిరుపేదలు నివశించే పూరిగుడిశలు, రేకుల ఇళ్ళు ఆనవాళ్ళు కోల్పోయాయి. మృతుల కుటుంబాలకు రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్) తీవ్ర సంతాపాన్ని తెలియబరుస్తోంది.

గత సంవత్సరం ఇదే సమయంలో ఫైలిన్ తుఫాను సృష్టించిన విధ్వంసంతో ఈ ప్రాంత రైతాంగం తీవ్రంగా నష్టపోయి వున్నారు. ఈ ఖరీఫ్ సీజనులో నెలకొన్న తీవ్ర వర్షాభావంతో రైతాంగం అనేక ఇబ్బందులనెదుర్కొని అరకొరాగానైనా సాగుచేసిన పంటభూములన్నీ ప్రస్తుత హుధూద్ తుఫాను ధాటికి తుడిచిపెట్టుకుపోయాయి. తుఫాను తీరం దాటినాక విస్తారంగా కురిసిన వర్షాలతో నాగావళి, వంశధార నదులు పొంగి ప్రవహించి సంభవించిన వరదల్లో వేలాది గ్రామాల్లో పంటలన్నీ నీట మునిగాయి. కొబ్బరి, అరటి, మామిడి, జీడిమామిడి, చెరకు వంటి తోటలన్నీ నేలకూలాయి. వరి, జొన్న, చోళ్ళు, మొక్కజొన్న తదితర పంటలన్నీ కనుమరుగయ్యాయి.

రాష్ట్రంలో అధికారం చేపట్టిన నాటి నుండి రైతాంగ రుణాల రద్దు సమస్యతో కొట్టుమిట్టాడుతున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు హుధూద్ తుఫాను కొంత విరామాన్నిచ్చింది.

తుఫానులు, వరదలు, అగ్నిప్రమాదాలు తదితర విపత్తులను సైతం తమ రాజకీయ ప్రయోజనాలకు నేర్పుగా వాడుకోవడంలో పాలకులు, వారి వందిమాగధులు పరిణితి సాధించారు.

చివరి తుఫాను బాధితుడికి సహాయమందిన తర్వాతనే విశాఖను వీడివెళతాననే ఆర్భాటపు ప్రకటనలతో విశాఖ చేరుకున్న ముఖ్యమంత్రి సమక్షంలోనే బాధితుల హాహాకారాలు మిన్నంటాయి.

హుధూద్ తుఫాను బీభత్సంతో బాహ్యప్రపంచంతో అన్నివిధాలా సంబంధాలు తెగిపోయిన బాధితులను ఆదుకోవటంలో వివిధ జిల్లాల ప్రజానీకం స్వచ్ఛందంగా స్పందించారు. ఆహారం, పాలు, నీరు, కూరగాయలు, ఇతర అవసరాలను భారీగానే విమానాల ద్వారా విశాఖకు చేరవేశారు.

కాగా, ఈ సహాయాన్నంతా ప్రాధాన్యతా క్రమంలో బాధిత ప్రాంతాలన్నింటికీ చేరవేసి, వారందరికీ సక్రమంగా పంపిణీ చేయటంలో అధికార యంత్రాంగం ఘోరంగా విఫలమైంది. ముఖ్యమంత్రి, మీడియా ప్రధానంగా కేంద్రీకరించిన విశాఖ నగరంలో పంపిణీకే అధిక ప్రాధాన్యతనిచ్చారు. వేల సంఖ్యలో రెవిన్యూ, మున్సిపల్, ఇతర పాలనా సిబ్బందిని వివిధ జిల్లాల నుండి విశాఖకు తరలించి, ముఖ్యమంత్రే స్వయంగా పర్యవేక్షిస్తున్నప్పటికీ ఈ సహాయం ప్రజలకు సక్రమంగా చేరలేదు. అనేక చోట్ల తొక్కిసలాటలు, 'దక్కినవాడికి దక్కినంత'లాగా పరిస్థితి దాపురించటం – పాలకుల మాటలకు, చేతలకు పొంతనలేక పోవటాన్ని స్పష్టంచేస్తోంది.

గ్రామాల్లో, పట్టణ ప్రాంతాల్లో రోజుల తరబడి విద్యుత్తు అందక ప్రజానీకం అల్లాడిపోయారు. ఆహారం, పిల్లలకు పాలు, నిత్యావసరాలు సైతం అందక యమయాతనలనుభవించారు. ఇదే అదునుగా పెట్రోలు, డీజిలు, పాలు, సరుకుల ధరలను అనూహ్యంగా పెంచి అమ్ముతున్నవారిని, ప్రజల అవసరాన్ని సొమ్ముచేసుకుంటున్న చీకటి బజారు వ్యాపారులను – ఉన్నతాధికారులందరూ విశాఖలో కేంద్రీకరించి కూడా అదుపు చేయలేకపోయారు.

పాలకులు, ప్రభుత్వ యంత్రాంగం, ప్రచార మాధ్యమాలు అన్నీ హుధూద్ సృష్టించిన విధ్వంసంతో అందాల విశాఖ నగరం కళా విహీనమైందనే కథనాలు, విశాఖ వీధులలో చెట్లు, విద్యుత్తు స్థంభాలు నేలకొరిగిన దృశ్యాలు, బహుళ అంతస్తుల భవనాల అద్దాలు పగిలిపోవటం, విమానాశ్రయ రేకులు లేచిపోవటం వంటివాటినే ప్రధానం చేస్తూ వచ్చారుగానీ, ఇంతకు అనేక రెట్లు విధ్వంసానికి, సర్వనాశనానికి గురైన రైతాంగం, మత్స్యకారులు, గ్రామీణ పేదల దుస్థితిపై కేంద్రీకరణకు శ్రద్ధపెట్టలేదు. ముఖ్యంగా రెక్కాడితేగానీ డొక్కాడని నిరుపేదలు, వ్యవసాయ కూలీలు కొంపా గోడు కోల్పోవటంతోపాటు, ఉపాధి కరవైన వారికి కనీస సహాయం అందలేదు.

విశాఖలో ముఖ్యమంత్రి కేంద్రీకరించటం; బాధిత ప్రాంతాల్లో ప్రధానమంత్రి పర్యటన, వెయ్యికోట్ల రూ॥ తక్షణ సహాయాన్ని ప్రధాని ప్రకటించటం.... వంటి చర్యలనే పత్రికలు వేనోళ్ళ కీర్తిస్తూ సమర్ధపాలనగా కితాబులిస్తున్నాయి.

బడా పెట్టుబడిదారులు, బహుళజాతి కంపెనీలు ఇప్పటికే తమ స్థావరాలను ఏర్పరచుకున్న 'ఆర్థిక రాజధానిగా' కీర్తిస్తున్న విశాఖలో త్వరితగతిన మౌలిక సదుపాయాలను పునరుద్ధరించి వారి నమ్మకాన్ని చూరగొనేందుకు, వారి పట్ల తమ విధేయతను చాటుకునేందుకు కేంద్ర, రాష్ట్ర పాలకులు పోటీపడుతున్నారు.

సముద్రతీర ప్రాంతాన్ని తుఫానుల, ఉప్పెనల విధ్వంసం నుండి సమర్ధవంతంగా కాపుగాచే మడ అడవుల పెంపకాన్ని నిర్లక్ష్యం చేసినవారే; తీరప్రాంత నియంత్రణ రేఖను అతిక్రమించి బడా కార్పొరేట్లకు Ô

Ô భూములు కట్టబెట్టినవారే; బీచ్‌శాండ్ ప్రాజెక్టులతో తీరప్రాంతాన్ని డొల్ల చేసిన పాలకులే, తీరప్రాంతంలో చేపట్టవలసిన రక్షణ చర్యల గురించి ఇపుడే కొత్తగా గుర్తించినట్లు గంభీరంగా మాట్లాడటం హాస్యాస్పదంగా వుంది.

1975లో దివిసీమ ఉప్పెనలో భారీగా జరిగిన ప్రాణనష్టం తదనంతరం నాటి కృష్ణాజిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో తీరప్రాంతంలో తుఫానులు, ఉప్పెనలను సమర్ధంగా ఎదుర్కోవటానికి చేపట్టాల్సిన చర్యలపై ఓ మాన్యువల్‌ను తయారుచేశారు. దీనికనుగుణంగా తీరప్రాంతంలో మడ అడవుల, సరుగుడు తోటల పెంపకం, తీరప్రాంత నియంత్రణ మండలి ఏర్పాటు, తుఫాను షెల్టర్ల నిర్మాణం, వాటి సమర్ధ నిర్వహణ, విపత్తుల నెదుర్కొనే మరిన్ని ప్రయోజనకరమైన అంశాలను అందులో పొందుపరిచారు. ఈ చర్యలు అమలైనమేరకు సత్ఫలితాలనిచ్చాయి.

కాలక్రమంలో ఈ మాన్యువల్‌ను బుట్టదాఖలు చేసిన పాలకులు, బడాకార్పొరేట్ల ప్రయోజనాలకనుగుణంగా తీరప్రాంత నియంత్రణలన్నీ ఎత్తివేస్తూ వచ్చారు. కాగా, హుధూద్ తుఫాను బీభత్సం తదనంతరమే కళ్ళు తెరిచినట్లుగా 'బ్లూబుక్' తయారుచేయబూనుకోవటం, ఒడిషా రాష్ట్రం చేపట్టిన చర్యల నుండి నేర్చుకోవాలనటం, తమ ఉద్దేశపూరిత నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకొని, ప్రజల్ని మోసగించేందుకేననేది స్పష్టం.

2011లో సంభవించిన సునామీ తాకిడికి జపాన్ దేశ తీర ప్రాంతంలోని ఫుకిషిమా అణు విద్యుత్తుకేంద్రం ధ్వంసమై, అణుధార్మికత వెలువడి, సృష్టించిన విధ్వంసం, ఆ విషాద అనుభవాలు మనముందే వున్నాయి. అయినా వీటిని పెడచెవిన పెట్టిన పాలకులు, **(తరువాయి 2వ పేజీలో)**

## చైనా విప్లవంనుండి పాఠాలను నేర్చుకుందాం; ఒంటబట్టించుకుందాం!

చైనా – వివిధ సామ్రాజ్యవాద దేశాల ఆధిపత్యంలోను, శతాబ్దాలుగా ఫ్యూడలిజం, అర్ధఫ్యూడలిజంల యొక్క ఆధిపత్యం కొనసాగటంతో దీర్ఘకాలంపాటు అత్యంత వెనుకబడిన సామాజిక సాంస్కృతిక వ్యవస్థలోనూ కొనసాగింది. చైనా అంతర్గత వైరుధ్యాలను, వాటిమధ్యనున్న అంతస్సంబంధాలను సరిగ్గా విశ్లేషించటంలోనూ; విశాల రైతాంగాన్ని సమీకరించి కార్మికవర్గ నాయకత్వంలో వ్యవసాయక విప్లవానికి సారధ్యం వహించటం లోనూ, ఆనాటి చైనా నిర్దిష్ట పరిస్థితులలో దీర్ఘకాల ప్రజాయుద్ధాన్ని విజయవంతంగా సాగించటంలోనూ, మార్క్సిజం–లెనినిజాలను చైనా నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించే చారిత్రాత్మక విప్లవ క్రమంలో సిద్ధాంత, ఆచరణ రంగాల్లో మావో నాయకత్వంలో దానిని మరింతగా అభివృద్ధిపరిచారు. లెనిన్ నాయకత్వంలో మహత్తర అక్టోబర్ విప్లవం తర్వాత, శక్తివంతమైన సోషలిస్టు శిబిరానికి జన్మనిచ్చిన; భూమండలంపైనున్న పెట్టుబడిదారీ వ్యవస్థ వెన్నులో వణుకు పుట్టించిన మరో మహత్తర విప్లవం ఇది. సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని, ఫ్యూడల్ సంబంధాలను కూలద్రోయటం ద్వారా నూతన ప్రజాస్వామిక దశను విజయవంతంగా ముగించుకుని, సోషలిస్టు వ్యవస్థ దిశగా మార్పుక్రమంలో పురోగమించటం ప్రపంచ వ్యాపితంగా పీడిత ప్రజానీకాన్ని ప్రభావితంచేసింది; అద్భుతమైన ప్రేరణను కలగజేసింది. ప్రపంచ సామ్రాజ్యవాద వ్యవస్థను ఒక కుదుపు కుదిపిన, భూమిని కంపింపజేసిన మరో సంఘటన ఇది.

అయితే రష్యాలోలాగా, చైనా కమ్యూనిస్టు పార్టీలో కూడా అంతర్గతంగా రివిజనిస్టులు సామ్యవాద వ్యవస్థ స్థానంలో తిరిగి పెట్టుబడిదారీ వ్యవస్థ పునరుద్ధరణకు సామ్రాజ్యవాద శక్తుల సహాయసహకారాలతో పార్టీలో కుట్రజేశారు. ఆ సమయంలో మావో నాయకత్వంలో కార్మికవర్గ విప్లవకారులు సాంస్కృతిక విప్లవాన్ని అనుసరించి సోషలిస్టు దిద్దుబాటు కార్యక్రమాన్ని తీవ్రస్థాయిలో కొనసాగించారు.

సామ్రాజ్యవాదుల సహాయ సహకారాలతో చైనాను సోషలిస్టు వ్యవస్థ నుండి దిగజార్చటానికి పెట్టుబడిదారీశక్తులు సాగించిన ప్రయత్నాలను ఓడించేందుకు కార్మికవర్గ నియంతృత్వంతో ఒక సోషలిస్టు దేశం వర్గపోరాటాన్ని కొనసాగించటం మరో గొప్పచర్య.

పెట్టుబడిదారీ శక్తులకు తిరిగి అధికారాన్ని కట్టబెట్టేందుకు, వారి పట్టును నిలబెట్టేందుకు విప్లవ ప్రతీఘాతుక శక్తుల శిబిరం అనాగరిక దాడులు సాగించిందనే దాంట్లో ఎలాంటి సందేహంలేదు. సాంస్కృతిక విప్లవకాలంలో తలెత్తిన అతివాద పెడధోరణి ఈ క్రమంలో తన పాత్రను తాను పోషించింది.

తిరిగి మరోసారి, మహత్తర చైనా విప్లవ అనుభవాలనుండి, సాంస్కృతిక విప్లవంవైపు దాని సాహసోపేతమైన పురోగమనాన్నుండి, తదనంతర కాలంలో పెట్టుబడిదారీ పంథాకు దిగజారటం వరకూ కూడా మార్క్సిస్టు – లెనినిస్టుశక్తులు పాఠాలను స్వీకరించాల్సి వుంటుంది.

అక్టోబర్ 1న చైనావిప్లవ దినోత్సవాన, ఈ మహత్తర విప్లవాల నుండి పాఠాలను స్వీకరించి, సామ్యవాదవ్యవస్థ స్థాపనకోసం, సామ్రాజ్యవాదాన్ని, అర్ధఫ్యూడల్‌వ్యవస్థను కూల్చే నూతన ప్రజాస్వామికంకోసం విప్లవ పోరాటమార్గంలో ముందుకు సాగాలనే మన నిశ్చయాత్మకతను ధృడపరుచుకుందాం.

చైనావిప్లవం వర్ధిల్లాలి!

మావో సేటుంగ్‌కు జోహార్లు.

**మహత్తర చైనా, రష్యా విప్లవాలకు జేజేలు**

# పెన్షన్ పథకంలో మార్పులు

## వెల్లడిఅవుతోన్న ప్రజాకర్షక పథకాల బూటకత్వం

**తిరిగి** అధికారపీఠం ఎక్కిన తెలుగుదేశం ప్రభుత్వం ప్రజల మౌలిక సమస్యలైన భూమి, ఉపాధి, పంటలకు న్యాయమైన ధరలు, గృహవసతి, విద్య, వైద్యం వంటి సమస్యల పరిష్కారం గురించి ఆలోచించకుండా, రైతుల రుణమాఫీని ఎలా తగ్గించాలి, ప్రజాకర్షక పథకాలను కుదించి వాటి బడ్జెట్‌ను ఏవిధంగా తగ్గించుకోవాలనే దానిపైనే తన దృష్టిని సారించింది.

తెలుగుదేశంపార్టీ ఎన్నికల ప్రణాళికలో వృద్ధులకు 200 నుండి వెయ్యి రూపాయలు, వికలాంగులకు 500 నుండి 1500రూ, వితంతువులకు 1000 రూ, అలాగే చేనేత, గీత వృత్తిదారులకు, ఎయిడ్స్ రోగులకు పెన్షన్లు పెంచుతానని ప్రకటించింది. రేషన్ కార్డులు లేనివారికి, ఫించన్లుకు అర్హులైనవారికి కార్డులు, పింఛన్ సౌకర్యం కల్పిస్తామని ప్రకటించింది. అధికారం చేపట్టిన తర్వాత కొత్త కార్డులు, కొత్త పింఛన్లమాట లేకపోగా ఉన్నవాటిని కూడా కుదించే చర్యలు చేపట్టింది.

గత సెప్టెంబర్ వరకు రాష్ట్రంలో వివిధ రూపాల్లో పింఛన్లు పొందుతున్నవారు 43,12,533 మంది వున్నారు. వీరిలో వృద్ధులు 23,60,013; వితంతువులు 13,19,079; వికలాంగులు 5,36,656; చేనేత కార్మికులు 74,754; గీత కార్మికులు 10,009 మంది వున్నారు. వీరుకాక గత ప్రభుత్వం రచ్చబండ కార్యక్రమం సందర్భంగా కొత్త పింఛన్లకోసం 15 లక్షల మంది ధరఖాస్తు చేసుకోగా రాష్ట్రంలోని 13 జిల్లాలకు సంబంధించి 2.61 లక్షలమందిని అర్హులుగా గుర్తించి పింఛన్ల జాబితాలో చేర్చారు. మిగతా దరఖాస్తులపై తెలుగుదేశం ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి వుంది.

పింఛన్ల పెంపుదలకు ఎన్నికల ప్రణాళికలో తెలుగుదేశం పార్టీ ఎటువంటి నిబంధనలు పెట్టలేదు. అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ల పెంపుకి రుణమాఫీకి పెట్టినట్లుగానే అనేక నిబంధనలు ప్రకటించింది. తద్వారా పింఛన్‌దారుల సంఖ్యను గణనీయంగా తగ్గించి అందుకు అయ్యే బడ్జెట్‌ను తగ్గించుకోనున్నది. 2011 ఏప్రియల్‌లో వృద్ధాప్య పింఛను అర్హతను 65 సం॥నుండి 60 సంవత్సరాలకు కేంద్రప్రభుత్వం తగ్గించి, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అమలు జరపాల్సిందిగా సమాచారం అందజేసింది. గత కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం, నేటి చంద్రబాబు ప్రభుత్వంకూడా కేంద్రప్రభుత్వ ఆదేశాలను ప్రక్కనపెట్టి 65 సం॥నిండిన వారికే వృద్ధాప్య పెన్షన్లు అమలు చేస్తున్నది. నిరుపేద వృద్ధుల ఎడల పాలకుల విధానాలకు ఇది అద్దంపడుతున్నది. 80 సం॥నిండిన వృద్ధ దంపతులను మినహాయించి అంతకు తక్కువ వయస్సు ఉన్న దంపతులకు ఒక్కరికి మాత్రమే పింఛను వస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. వృద్ధాప్య పింఛన్లకు పెట్టినట్లుగానే వికలాంగుల పింఛన్లకు నిబంధనలు ప్రకటించింది. 40 నుండి 70 శాతం అంగవైకల్యం ఉన్నవారికి వెయ్యిరూపాయలు, 80శాతం పైగా ఉన్న వారికి 1500 రూ.గా ప్రకటించింది. పెన్షన్‌కి అర్హులైన వారికి కూడా ఆధార్‌కార్డులేకపోతే పెన్షన్ నిలుపుదల చేస్తుంది. రెండునెలలలోపు ఆధార్‌కార్డు అందచేస్తే నిలుపుదల చేసిన మొత్తాన్ని కూడా అందచేయటం జరుగుతుందని, లేకుంటే వారిని జాబితానుండి తొలగిస్తామని చెప్పటం అర్హులను కూడా కుదించేందుకేనన్నది వాస్తవం. గ్రామ పంచాయితీ, మండల రెవిన్యూ అధికారి, కలెక్టర్ అన్నివిధాల పరిశీలించి వృద్ధులు, వికలాంగులు, వితంతువులు అని నిర్ధారించి పెన్షన్‌కి అర్హులుగా ప్రకటించిన దానికన్నా అర్హతకు గీటురాయి ఏమున్నది? ఆధార్‌కార్డుకి అంతకుమించి ప్రత్యేక అర్హత ఏమున్నది? దేశప్రజల సమస్త వివరాలు సామ్రాజ్యవాద దేశాలకు అందచేయటంతప్ప ఆధార్‌కార్డుకి ప్రత్యేకత ఏమిలేదు. అందువలన ఆధార్‌కార్డు అర్హత అనే నిబంధనను ప్రక్కన పెట్టాలి.

పేద కుటుంబాల్లోని వృద్ధులు, వితంతువులు, అంగవికలురకు జీవనాధారం సమస్యగా మారి దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఇలాంటి వారికి యిచ్చే నామమాత్రపు సహాయానికి ఆంక్షలు పెట్టటం జుగుప్సాకరమైంది. ప్రస్తుత నిత్యావసర ధరల ప్రకారం కుటుంబ ఖర్చు కనీసం 5వేలకు తక్కువ కాదు. ప్రభుత్వం అందచేసే వెయ్యి, 15 వందల రూపాయలు పోషణకు ఏమాత్రం సరిపోదు. ఈ వాస్తవాన్ని ఉద్దేశ పూర్వకంగా ప్రభుత్వం విస్మరిస్తున్నది. తానిచ్చే పెన్షన్ డబ్బులే పేదలను ఉద్ధరిస్తున్నట్లు ప్రచారం చేసుకోవటం సిగ్గుచేటు.

గత ప్రభుత్వం మంజూరుచేసిన పింఛనుదారుల్లో అనేక అవకతవకలు జరిగాయని, అర్హులుగాని వారు కూడా పింఛన్లు పొందుతున్నారని వాటన్నిటిని సమీక్షించి, అవకతవకలను సరిచేసి నిజమైన వారికి పింఛన్లు అందించేందుకు అంటూ జి.ఓ. 135ను ప్రభుత్వం ప్రకటించింది. జీ.వో.లో పొందుపర్చిన దానిప్రకారం గ్రామ, మున్సిపాలిటీల స్థాయిలో సమీక్షా కమిటీలు ఏర్పాటుచేసి, గ్రామస్థాయిలో సర్పంచ్‌లు, మున్సిపాలిటీ స్థాయిలో ఛైర్మన్లు, మేయర్లతోపాటు ఇద్దరు స్వయంసహాయక గ్రూపుకి చెందినవారు, మరో యిద్దరు సామాజిక కార్యకర్తలు వుంటారు. గ్రామ, వార్డు స్థాయిల్లో ఈ కమిటీలు పింఛనుదారులను సెప్టెంబర్ 19, 20 తేదీల్లో సమీక్షించాయి. జిల్లా స్థాయిలో మంత్రులకు మాత్రమే చోటు కల్పించి, యం.ఎల్.ఏ. లకు అవకాశం కల్పించకపోవటం ప్రతిపక్ష పార్టీలకు ప్రాధాన్యత లేకుండా చేయటమే.

పాలకపార్టీల్లో ఏది అధికారంలో వుంటే అది నియమించే కమిటీల్లో ఆ పార్టీ వారికే ప్రాతినిధ్యం ఎక్కువగా వుంటుంది. ఆ పార్టీ ఛోటా నాయకులు పైరవీలు చేస్తుంటారు. ఈ పైరవీకారుల, అధికారుల అవినీతివలన పథకాల లబ్ధిదారుల్లో అర్హులు కానివారు కూడా వుండటానికి అవకాశం వుంది. అర్హులైన పేదలు దూరంగా వుండే అవకాశమూ వుంది. ఇప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటుచేసిన కమిటీలు అందుకు అనుగుణంగానే వున్నాయి. అందుకు కమిటీల స్వరూపం అద్దం పడుతున్నది. పథకాల అమలుకు ఏర్పాటుచేసే ఏ కమిటీ అయినా ప్రజల సమక్షంలో, వారి ఆమోదంతో జరిగినప్పుడే లబ్ధిదారుల ఎంపిక సక్రమంగా వుంటుంది. ఏ పాలకపార్టీ ఇలాంటి పద్ధతిని అనుసరించకపోవటం వాటి రాజకీయ ప్రయోజనాల కోసమే జరుగుతున్నది. ఇప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటుచేసిన కమిటీలు ఆ విధంగానే వున్నాయి. గ్రామ సర్పంచ్, మున్సిపల్ ఛైర్మన్లు, మేయర్లు, వార్డు మెంబర్లు ఒక పార్టీకి ప్రతినిధులుగానే వుంటున్నారు. స్వయం సహాయక, స్వచ్ఛంద సంస్థల నుండి కూడా తనకు అనుకూలమైనవారినే ప్రభుత్వం నియమిస్తుంది. ఈ కమిటీల్లో స్వచ్ఛంద సంస్థలకు చోటు కల్పించటమంటే వాటి ప్రాబల్యం పెంచి ప్రజలను వాటి చుట్టూ త్రిప్పేందుకు ఉద్దేశించబడిందే. ఈ కమిటీల ద్వారా తెలుగుదేశం ప్రభుత్వం పేదల ప్రయోజనం కాకుండా రాజకీయ లబ్ధిపొందేందుకే అన్న వాస్తవాన్ని గమనించాలి. గత ప్రభుత్వం కాలంలో ఆ పార్టీకి చెందినవారు పైరవీలు చేస్తే, ఇప్పుడు లబ్ధిదారుల ఎంపికలో తెలుగుదేశంపార్టీ వారి పైరవీలు కొనసాగుతున్నాయి. అర్హులైన పేదలకు అన్యాయం జరుగుతుంది.

ప్రభుత్వం నియమించిన కమిటీల సర్వే పూర్తిఅయిన తర్వాత ప్రభుత్వం పింఛనుదారుల వివరాలను ప్రకటించింది. దానిప్రకారం అక్టోబర్ 2 నుండి పింఛనుకు అర్హులైనవారు, అర్హులుకాని వారు ఈవిధంగా వున్నారు.

ప్రభుత్వం ప్రకటించిన వివరాల ప్రకారం పింఛన్లకు అర్హత కోల్పోయినవారు 6,09,597 మంది.

ఆధార్‌కార్డులు లేవనో, పరిశీలనలో అందుబాటులో లేరనో లక్షలాదిమంది నిరుపేదలను పింఛన్లకు దూరంచేశారు. గుంటూరుజిల్లా వేమూరు మండలం కాకర్లమూడి గ్రామంలో ఇంతకుముందు పింఛను పొందుతున్న నిరుపేదలు ప్రస్తుతజాబితాలో లేకపోవటం అందుకు ఉదాహరణ. గ్రామ ప్రజలందరూ ఇది దారుణమని మాట్లాడుతున్నారు. ఇలాంటివే చాలా గ్రామాల్లో చోటుచేసుకున్నాయి.

పాలక ప్రభుత్వాలు చేసే చట్టాలు, పథకాలు అవి ప్రాతినిధ్యం వహిస్తున్న వర్గప్రయోజనాలకు అనుగుణంగానే వుంటాయి. సామ్రాజ్యవాదుల, బడా పెట్టుబడిదారుల, భూస్వాముల దోపిడీ ప్రయోజనాల కోసమే అధికారమార్పిడి జరిగిన నాటినుండే కేంద్ర – రాష్ట్రపాలకులు పరిపాలన సాగిస్తున్నారు. గ్రామీణ పేదలు, కార్మికులు సృష్టించిన సంపదలను దోపిడీ వర్గాల పరంచేస్తూ అందులో వీరు వాటా పొందుతున్నారు. అందువలన కేంద్ర – రాష్ట్రప్రభుత్వాలు ప్రవేశపెట్టే పథకాలు పేదల పేదరికాన్ని తొలగించటానికో, వారి జీవన ప్రమాణాన్ని పెంచటానికో ఉద్దేశించబడినవి కావు. తమ పేదరికానికి భూమిపై హక్కులేకపోవటమన్న వాస్తవాన్ని గ్రహించిన గ్రామీణ పేదలు, తమ దుర్భర జీవితాలకు ఉత్పత్తి సాధనాలు, పరికరాలపై హక్కులేకపోవటమేనని తెలుసుకున్న కార్మికులు ఆ హక్కును సాధించేందుకు చేసిన పోరాటాలు పాలకవర్గాలను గడగడలాడించాయి. ఆ పోరాటాలు విస్తరిస్తే తమ పునాదులు కదలిపోతాయన్న భయంతో, ఆ పోరాటాలపై క్రూరమైన నిర్బంధాన్ని ప్రయోగిస్తూనే, ప్రజల్లో భ్రమలు కల్పించి, పోరాటమార్గం నుండి మళ్లించేందుకు కొన్ని చట్టాలు, పథకాలు పాలకులు ప్రవేశపెట్టారు. 1946–51 మధ్య జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, 1967లో శ్రీకాకుళ గిరిజన పోరాటాలు పాలకులచే భూసంస్కరణ చట్టాన్ని, 1/70 చట్టాన్ని చేయించాయి.

ఒకవైపున మౌలిక సంస్కరణలు చేస్తామంటూ నినాదాలిస్తూనే దారిద్ర్య నిర్మూలనా పథకాలను ప్రవేశపెట్టారు. వీటిద్వారా ప్రజలలో భ్రమలు కల్పించి, ప్రజల్లో నోరున్న వారిని అవినీతిపరం చేసి తమ రాజకీయ ప్రాబల్యం నిలుపుకున్నారుతప్ప ప్రజల దారిద్ర్యాన్ని తగ్గించలేదు. ఆ తర్వాత నిరంతరాయంగా ఆదాయమిచ్చే ఆస్థిని కల్పించటంద్వారా(కోళ్లు, మేకలు, గేదెలు) దారిద్ర్యాన్ని నిర్మూలిస్తామంటూ కొత్తపథకాలను ప్రారంభించారు. ఇవీ ప్రజల దారిద్ర్యాన్ని తీర్చలేదంటూ తక్షణ సాయం అందించటమే ముఖ్యమని వాదించి ప్రజాకర్షక పథకాలను ప్రవేశపెట్టారు. పెన్షన్ పథకాలు ఈ కోవకు చెందినవే. ప్రతిసారి సహాయంకోసం ఎదురు చూడాల్సిన బిచ్చగాళ్ల స్థాయికి పేద ప్రజలను కుదించారు.

ఒక పథకాన్ని ప్రవేశపెట్టడం, రెండేళ్లతర్వాత అనర్హులు లబ్ధిపొందుతున్నారంటూ దాన్ని కుదించటం, అంతకంటే మెరుగైన పథకమంటూ కొత్తపేరుతో పాత పథకాన్నే తిరిగి ప్రవేశపెట్టడం–ఆవిధంగా ప్రజలను నిరంతరం భ్రమలపాలు చేసే తమ చుట్టూ త్రిప్పుకునే విధానాన్నే ఏ పాలకముఠా అధికారంలో వున్నా అనుసరిస్తున్నాయి. లెక్కల తకరారుతో దారిద్ర్యం తగ్గిపోయిందని చూపటం మినహా, పథకాలు ప్రజల దారిద్ర్యాన్ని రూపమాపలేవు. ✡

### పింఛన్ల గణాంకాలు

| | |
|---|---|
| కమిటీల పరిశీలనకు ముందు మొత్తం పింఛనుదారుల సంఖ్య | 43,12,533 |
| పరిశీలన పూర్తిచేసిన తర్వాత కంప్యూటరీకరణ చేసిన వారి సంఖ్య | 42,01,161 |
| తనిఖీలకు అందుబాటులో లేనివారి సంఖ్య | 1,11,372 |
| పరిశీలన జరిపి అనర్హులుగా గుర్తించినవారు | 3,34,569 |
| అర్హుల్లో ఆధార్‌కార్డు కలిగినవారు | 37,02,936 |
| అర్హుల్లో ఆధార్‌లేని వారు | 1,63,656 |
| అక్టోబర్ 2 నుంచి పింఛన్లకు అర్హత కోల్పోయినవారు | 6,09,597 |
| ప్రభుత్వ లెక్కల ప్రకారం కొత్త పింఛన్లకు అందిన ధరఖాస్తులు | 7,74,137 |

ఆధారం: 3-10-14 సాక్షి దినపత్రిక

### హుధూద్ తుఫాన్... (మొదటిపేజీ తరువాయి)

ప్రజల నిరసనలను బేఖాతరు చేస్తూ శ్రీకాకుళం జిల్లా తీరప్రాంతం – రణస్థలంలో అణువిద్యుత్తు కేంద్ర నిర్మాణానికి ఈ సమయంలోనూ వెనుదీయకుండా త్వరితగతిన చర్యలు చేపడుతున్నారు. తూర్పుగోదావరి జిల్లా 'నగరం' గ్యాసు పైపులైను లీకేజీనే నివారించలేక, ఘోర అగ్నిప్రమాదానికి కారకులైన ఈ పాలకులు, హుధూద్ లాంటి తుఫానుల తాకిడికి అణువిద్యుత్తు కేంద్రంలో ప్రమాదం సంభవిస్తే జరిగే వినాశనం గురించి తెలిసి తెలిసీ ప్రజలను బలిపశువులను చేయదలచుకున్నారనేది స్పష్టం.

హుధూద్ సృష్టించిన విలయంతో గ్రామీణ, తీర ప్రాంతాలలోని రైతులు, వ్యవసాయకూలీలు, ఆదివాసులు, మత్స్యకారులు, చేతివృత్తుల ప్రజానీకం తీవ్రంగా నష్టపోయి; సర్వస్వం కోల్పోయారు.

ఈ నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర పాలకులు, అధికార యంత్రాంగం వెనువెంటనే కదిలి బాధిత ప్రజానీకానికి తక్షణ సహాయ, పునరావాస సౌకర్యాలు కల్పించటంతో పాటు, తిరిగి వారు తమ జీవనాన్ని కొనసాగించేందుకు అవసరమైన అన్ని సహాయ, సహకారాలను కల్పించాలి. ప్రత్యేకించి పీకలలోతు కష్టాలలో మునిగిన రైతాంగాన్ని ఆదుకునేందుకు పంటలకు నష్టపరిహారం, రుణాల రద్దుతోపాటు, తక్షణం వేసుకోదగిన పంటలకు అవసరమైన సూచనలు, విత్తనాలు, రుణాలు తదితరాలను పూర్తిస్థాయిలో అందజేయటం ద్వారానే రైతాంగం కనీసంగా కోలుకోగలుగుతారు.

బాధిత ప్రజానీకాన్ని బిక్షగాళ్ళుగా భావించి వ్యవహరించే పాలకుల విధానాలకు వ్యతిరేకంగా సంఘటితమవ్వాలని; ఇప్పటికే అనేక విధాలా కష్టాలెదుర్కొంటున్న ప్రజానీకమంతా ఐక్యంగా నిలిచి ప్రభుత్వ సహాయాన్ని ఒక హక్కుగా సాధించుకోవాలని రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్) పిలుపునిస్తోంది.

**డిమాండ్స్ :**

1) హుధూద్ తుఫానుతో సర్వస్వం కోల్పోయిన రైతులు, వ్యవసాయ కూలీలు, మత్స్యకారులు, ఆదివాసులు, ఇతర గ్రామీణ పేదలకు ప్రధమ ప్రాధాన్యతలో సహాయం అందచేయాలి.
2) పంటలు కోల్పోయిన రైతులకు తగిన పరిహారం అందజేయటంతోపాటు తక్షణం పంట వేసుకోవటానికి వీలైన విత్తనాలు, ఎరువు, పురుగు మందులతోపాటు, రుణసౌకర్యం కల్పించాలి.
3) ఇళ్లు కోల్పోయిన పేదలు, వ్యవసాయ కూలీలు, మత్స్యకారులందరికీ పక్కా ఇళ్ళు నిర్మించటంతో పాటు, కోల్పోయిన పనిదినాలకు పరిహారం చెల్లించి, తక్షణం ఉపాధి సౌకర్యం కల్పించాలి.
4) మత్స్యకారులు కోల్పోయిన వలలు, పడవలు తదితర సామాగ్రిని వారికి అందచేయాలి.
5) తీవ్రంగా నష్టపోయిన చిన్నపరిశ్రమల పునరుద్ధరణకు తక్షణ చర్యలు చేపట్టి, వారికి విద్యుత్తు, రుణసౌకర్యం తదితర రాయితీలు కల్పించాలి.
6) హుధూద్ తుఫానుతో నిరవధికంగా పనులు కోల్పోయిన కార్మికులకు – ప్రత్యేకించి కాంట్రాక్టు కార్మికులు తిరిగి విధులకు హాజరయ్యే వరకు ప్రభుత్వమే భృతి, వసతి కల్పించాలి.

**17-10-14**

**రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్)**

### జాధవ్‌పూర్ విశ్వవిద్యాలయంలో విద్యార్థులపై పోలీసుల దాడిని ఖండించండి

2014 సెప్టెంబర్ 16–17 తేదీల మధ్య రాత్రి జాధవ్‌పూర్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో విద్యార్థులపై పోలీసులు సాగించిన క్రూరమైన దాడిని సిపిఐ(ఎం–ఎల్) పశ్చిమబెంగాల్ రాష్ట్రకమిటి తీవ్రంగా ఖండిస్తోంది. విద్యార్థుల శాంతియుత నిరసనను అడ్డుకునేందుకు వైస్‌ఛాన్స్‌లర్ పోలీసులను పిలువనంపాడు. విద్యార్థినులతోసహా, 30మంది ఈ పోలీసుల దాడిలో తీవ్రంగా గాయపడి, ఆసుపత్రులలో చేరారు. విద్యార్థినులతో సహా మొత్తం 37 మందిని పోలీసులు అరెస్టు చేశారు.

ఆగస్టు 28న యూనివర్సిటీ ప్రాంగణంలో ఓ విద్యార్థినిపట్ల అవమానకరంగా వ్యవహరించిన సంఘవ్యతిరేకశక్తులపై చర్య తీసుకోవాలని వారంరోజులుగా శాంతియుతంగా బైఠాయించి నిరసన తెలియజేస్తున్న నేపథ్యంలో ఈ పోలీసుల దాడి జరిగింది. విద్యార్థిని వేధింపు ఘటనపై స్వతంత్ర బృందంతో దర్యాప్తు సాగించాలని విద్యార్థులు కోరుతున్నారు. బాధిత విద్యార్థినిని వేధింపుకు గురిచేసిన యూనివర్శిటి అంతర్గత ఫిర్యాదుల కమిటి సభ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు. చట్టబద్ధమైన, కనీసమైన విద్యార్థుల కోర్కెలు తీర్చటానికి తగిన చర్యలు తీసుకొని, యూనివర్శిటీ ప్రాంగణంలో విద్యార్థినుల భద్రతను కట్టుదిట్టం చేయటంకాకుండా, విద్యార్థులపై పోలీసులను ఉసికొల్పటాన్ని సిపిఐ(ఎం.ఎల్) తీవ్రంగా ఖండిస్తోంది.

దాడులకు పాల్పడిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని; యూనివర్శిటీ విద్యార్థులను ప్రత్యేకించి విద్యార్థినులను కాపాడటంలో విఫలమైన వైస్‌ఛాన్స్‌లర్‌తో సహా యూనివర్శిటీ అధికారులందరిపైనా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా విద్యార్థినిని అవమానానికి గురిచేసిన సంఘవిద్రోహులను కఠినంగా శిక్షించాలని సిపిఐ(ఎం–ఎల్) డిమాండ్ చేస్తున్నది. ✡

# 'ఒకరినొకరు ద్వేషించుకోవటం ఆపండి! కలిసికట్టుగా నిలచి మోసగాళ్లను గుర్తించండి!'

## అమెరికా గూఢచారి రాబర్ట్ బాయర్‌తో ముఖాముఖి

*రాబర్టు బాయర్ అమెరికా గూఢచారిగా పనిచేశాడు. బిల్‌క్లింటన్, జార్జిబుష్‌లు అధ్యక్షులుగా వున్నప్పడు యుగోస్లావియాలో పనిచేశాడు. యుగోస్లావియాను ముక్క చెక్కలు చేసిన అమెరికా సామ్రాజ్యవాదం కుట్రను బయటపెట్టాడు. ఆనాడు ప్రచారంలో పెట్టిన కట్టుకథల బండారాన్ని తెలిపాడు.*

*ఇరాక్‌పై దురాక్రమణకు ఇలాంటి కట్టుకథలే (మానవ విధ్వంసకర ఆయుధాలు ఇరాక్ తయారు చేసిందన్న ప్రచారం) ప్రచారం చేశారు. ఇప్పడు సిరియాపై యుద్ధానికి ఇలాంటి కట్టుకథల ప్రచారమే సాగుతున్నది.*

*కెనడా పాత్రికేయుడు మిలోస్ కుపుర్డిజా చేసిన ముఖాముఖిని 'రివల్యూషనరీ డెమోక్రసీ' పత్రికనుండి అనువదించి ఇస్తున్నాము.* **– సంపాదకుడు**

**ప్రశ్న : మీరు యుగోస్లావియాకు ఎప్పుడొచ్చారు? మీరు మొట్టమొదట చేసిన పనేమిటి?**

జవాబు : 1991 జనవరి 12న మరొక ముగ్గురితో కలిసి హెలీకాప్టర్‌లో సారజేవో వచ్చాను. సారజేవో మీద దాడి చెయ్యబోతున్నారనబడే టెర్రరిస్టులనే వారిపై కన్నువేసి వుంచటం నాకప్పగించిన పని.

**ప్రశ్న : ఆ టెర్రరిస్టులనబడే వారెవరు? వారెందుకు సారజేవో మీద దాడిచేస్తారని భావించారు?**

జవాబు: యుగోస్లావియానుండి బోస్నియా విడిపోయేలా చేసేందుకు సారజెవో నగరంలోని ముఖ్యమైన భవనాలపై "సెర్బియా సుప్రిం" సంస్థ దాడి చేస్తుందని మాకు చెప్పారు.

**ప్రశ్న : అలాంటి సంస్థ వుందా? సారజెవోలో అసలు మీరేం చేశారు?**

జవాబు : అలాంటి సంస్థ అన్నదే ఉనికిలో లేదు. మా కేంద్ర ఉన్నతాధికారులు మమ్మలను మోసం చేశారు. (అలాంటి దాడులు జరుగుతాయని) ప్రజలను హెచ్చరించటమూ,బోస్నియా రాజకీయ నాయకత్వంలో భయాన్ని కలిగించటమూ మా పనిగా అప్పజెప్పారు. దీంతో సెర్బులు దాడి చేస్తారన్న భావనను వ్యాపింపచేసి, నాయకుల బుర్రలను దానితో నింపివేశాము. ఈ కథను మొదట మేము నమ్మాం. అసలు ఉనికిలోనే లేని సంస్థ గురించి కథలు ప్రచారం చేస్తున్నామని మాకు తర్వాత అర్థమైంది.

**ప్రశ్న : ఎన్నాళ్లీ పనిసాగింది? దానికేం పేరు పెట్టారు?**

జవాబు : నేనీపని రెండు వారాలే చేశాను. ఎందుకంటే అప్పుడు నన్ను మరో పనిమీద స్లొవేనియా పంపారు. కానీ ఆ పని మరోనెలపాటు కొనసాగింది. దానికి పెట్టిన పేరు 'ఇస్తినా' (రక్షణ) దాని అర్థానికి పూర్తిగా వ్యతిరేకమైన పని.

**ప్రశ్న : మీరు స్లొవేనియా ఎందుకెళ్లారు?**

జవాబు : యుగొస్లావియా నుండి స్లొవేనియా స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకునేందుకు సిద్ధంగా వుందని నాకు చెప్పారు. ప్రభుత్వేతర సంస్థలకు, ప్రతిపక్ష పార్టీలకు, నాయకులు ఇచ్చేందుకు నాకు అనేక వందల కోట్ల డాలర్లు ఇచ్చారు. జనంలో వైషమ్యాలను పెంచేందుకు వీరందరూ అంగీకరించారు.

**ప్రశ్న : ఈ ప్రచార కార్యక్రమాలు చూసిన తర్వాత అమెరికా గూఢచారి సంస్థ (సిఐఏ)పై మీకే అభిప్రాయం ఏర్పడింది? మీతోటి వారేమనుకున్నారు?**

జవాబు : పరిస్థితి ఉద్రిక్తంగా వున్న సమయంలో సిఐఏ ఇచ్చిన పనిని చేయననిచెప్పటం మాకెవరికీ సాధ్యం కాదు. యుగోస్లావియాలో సెర్బులకు వ్యతిరేకంగా ప్రచారం చేయటానికి నిరాకరించిన అనేకమంది ఏజంట్లు అదృశ్యమైపోయారు. సిఐఏ, అమెరికా రాజకీయ నాయకులు ప్రచారం చేస్తున్న అబద్ధాల పుట్టలను చూసినేను అప్రతిభుడినయ్యాను. అనేకమంది సిఐఏ ఏజెంట్లు మొత్తం పనిలో ఒక్క అంశం పైనే పనిచేయటంతో వారికి విషయం పూర్తిగా అర్థంకాలేదు. మొత్తం చిత్రంలో ముక్కలన్నింటిని ఒకచోట చేర్చుకో గలిగిన వారికి అసలు లక్ష్యాలు అర్థమయ్యాయి. వారందరూ రాజకీయ నాయకులే.

**ప్రశ్న : కనుక సెర్బులకు వ్యతిరేకంగా మాత్రమే ప్రచారం జరిగిందా?**

జవాబు : అవును, మరియు కాదు. ప్రచారంయొక్క లక్ష్యం రిపబ్లిక్కులను విడదీయటం; మాతృ యుగోస్లావియా నుండి వాటిని వేరుచేయటం. జరిగిన దానికంతటికి నిందించటానికి మాకొక బలిపశువు కావాలి. జరిగిన యుద్ధానికి, హింసాకాండకూ బాధ్యులను చేయటానికి ఎవరో ఒకరు కావాలి. ఒకవిధంగా యుగోస్లావియాకు వారసుడిగా వుంటుందిగనుక సెర్బియానెంచుకున్నారు.

**ప్రశ్న : సిఐఏనుండి డబ్బులు ముట్టిన యుగోస్లావియా లోని మాజీ రాజకీయ నాయకుల పేర్లు చెప్పగలరా?**

జవాబు : అలాగే. ఇది కొంత సున్నితమైన అంశం. స్టైప్ మెసిక్, ఫ్రాంజో టుడ్జమాన్, అలీజా ఇజెబెగోవియా తదితర ప్రభుత్వ సలహాదారులు, సభ్యులున్నారు. అలాగే సెర్బియా సైనికాధిపతులు, జర్నలిస్టులు, కొన్ని సైనికదళాలు కూడా వున్నారు. రడోవాన్ కరుడిజిక్ కొంతకాలం డబ్బు తీసుకున్నాడు గానీ తర్వాత బోస్నియాలో నేరాలకు తనను నిందిస్తారని అర్థ మవటంతో మానివేశాడు. అతన్ని అమెరికా పాలకులు ఆడించారు.

**ప్రశ్న : ప్రసార మాధ్యమాలకు డబ్బు అందించటం గురించి మీరు చెప్పారు. అదెలా జరిగింది?**

జవాబు : న్యూస్ రీడర్లు చదివే అధికారిక ప్రకటనలను కొంతమంది సిఐఏ ఏజంట్లు రాసేవారన్న సంగతి ఇప్పటికే బయటపడింది. మా సిఐఏ బాస్ ఇచ్చిన ఆదేశాలమేరకు ఈ మాధ్యమాల అధిపతులు ఇచ్చిన ఆదేశాలతో చదివేవారు తప్ప, న్యూస్ రీడర్లకీవిషయం తెలియదు. టెలివిజన్ ద్వారా జాతీయోన్మాదాన్ని, వైషమ్యాన్ని రెచ్చగొట్టడం అన్నది అసలు లక్ష్యం.

**ప్రశ్న : స్రెబ్రెనికా (ఒకపట్టణం) గురించి అందరం విన్నాం. దానిగురించి ఏమైనా చెప్పగలరా?**

జవాబు: అలాగే. 1992 నేను మళ్లీ బోస్నియాకు వచ్చాను. అప్పుడే స్వాతంత్ర్యం ప్రకటించుకున్న బోస్నియా సైనిక దళాలకు శిక్షణనిచ్చే పనియిచ్చి పంపారు. దురదృష్టవశాత్తు చాలామంది మోసగించ బడ్డారు. స్రెబ్రెనికాలో మృతుల సంఖ్యను రాజకీయ వ్యాపారంగా చేశారు. గతంలో అమెరికా పార్లమెంటు సభ్యుడిగా వున్న నా బాసు బోస్నియాలో ఏదో ఒక హింసాకాండ సాగిస్తామని అనేకసార్లు నాతో అన్నాడు. స్రెబ్రెనికాలో మారణకాండకు నెలరోజుల ముందు ఈ పట్టణం ప్రపంచానికంతా తెలుస్తుందనీ, మనం ఈ సంగతి ప్రచార మాధ్యమానికి తెలపాలనీ అన్నాడు. ఇలా అంటున్నారేమిటీ అని నేనడుగగా నువ్వే చూస్తావు కదా అని అన్నాడు. స్రెబ్రెనికాలోని ఇళ్లపై బోస్నియా సైనికులతో కలిసి దాడి చెయ్యమన్న ఆజ్ఞలు మాకందాయి. అప్పటికే వైషమ్యాలు పెంచబడ్డాయి గనుక సెర్బులు తిరుగుదాడి చేశారు. దానికి కూడా డబ్బు చెల్లించారు.

**ప్రశ్న : స్రెబ్రెనికాలో మారణకాండకు బాధ్యులెవరు?**

జవాబు : స్రెబ్రెనికాలో మరణాలకు బోస్నియన్లు, సెర్బులు, అమెరికన్లు కారణం. కానీ మొత్తం నిందంతా సెర్బులపై వేశారు. ఖననం చేసిన వారందరూ ముస్లిములని చెప్పారు. వాస్తవానికి వారు సెర్బులు, ఇతర జాతీయులు. ఒకప్పుడు సిఐఏ ఏజెంటు, ఇప్పుడు ఐయంఎఫ్‌లో పనిచేస్తున్న నా స్నేహితుడొకరు అమెరికా ప్రభుత్వానికి, బోస్నియా రాజకీయ నాయకులకు మధ్య కుదిరిన ఒప్పందం ఫలితమే స్రెబ్రెనికా అని నాతో చెప్పాడు. స్రెబ్రెనికాను బలిపశువును చేశారు. దానితో అమెరికాకు సైనికదాడి చేయటానికి ఒక సాకు కల్పించ బడింది.

**ప్రశ్న : యుగోస్లావియా ఎందుకు ముక్కలైందని మీరనుకుంటున్నారు? ఈ పరిణామంలో తనకు పాత్రవుండాలని అమెరికా ఎందుకు కోరుకుంది?**

జవాబు : అంతా స్పష్టంగానే వుంది. వెనకాలుండి యుద్ధాన్ని రేపెట్టి, శాంతి గురించి గొంతుచించుకు అరచిన వారందరూ ఖనిజసంపదను దోచుకునే కంపెనీల అధిపతులే. వారందరూ మిమ్మలను బానిసలను చేశారు. మీ ప్రజలు ఉచితంగా శ్రమ చేస్తున్నారు. ఉత్పత్తులన్నీ జర్మనీకి, అమెరికాకు వెళు తున్నాయి. వారి సంపాదన పెరుగుతున్నది. మీరు తయారుచేసిన వస్తువులనే దిగుమతి చేసుకుని వాటికి మీరే మూల్యం చెల్లిస్తున్నారు. మీకు డబ్బులేకుండా పోయిందిగనుక అప్పులు తీసుకుంటున్నారు. బాల్కన్ దేశాలన్నిటా జరిగిందిదే.

**ప్రశ్న : సిఐఏ ఏజంటుగా మీరు కొసావోలో పనిచెయ్యలేదు. అక్కడ కూడా అమెరికా ప్రమేయం వుందా?**

జవాబు : అక్కడకూడా వుంది. రెండు కారణాలరీత్యా కొసావోను ఆక్రమించారు. ఒకటి దానికున్న సంపద్వంత సహజ, ఖనిజ వనరులు. రెండవది. కొసావోలో వున్న నాటో సైనిక స్థావరం. యూరపు ఖండం గుండెలో అతిపెద్ద సైనిక స్థావరమిది.

**ప్రశ్న : మాజీ యుగోస్లావియా ప్రజలకు మీరిచ్చే సందేశమేదైనా వుందా?**

జవాబు : అవును వుంది. కల్పితమైన అబద్ధాలతో నిండిన సమీప గతాన్ని మరచిపొండి. మిమ్మలను మోసానికి గురిచేశారు. వారికి కావలసింది సాధించు కున్నారు. మీరింకా ఒకరినొకరు ద్వేషించుకోవటం తెలివిమాలినతనమౌతుంది. మీరు మీ బలాన్ని చూపాలి. జరిగిందేమిటో, దానికి బాధ్యులెవరో తెలుసుకోండి. నేను హృదయపూర్వక క్షమాపణను కోరుతున్నాను. సిఐఏ, శ్వేత సౌధం రహస్యాలను ఇందుకోసమే బయట పెడుతున్నాను. ✶

# ప్రజావ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాల అమలులో యుపిఏ-ఎన్‌డిఏ దొందూ దొందే!

**ఎన్‌డిఏ** ప్రభుత్వం తన వందరోజుల పాలనా కాలంలో ప్రజావ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలను అమలుచేయటంలో గత యుపిఏ ప్రభుత్వానికి ఏమాత్రం తీసిపోనని రుజువుచేసుకొంది. మీదు మిక్కిలి ప్రజావ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలను మరింత తీవ్రంగా, క్రూరంగా అమలుచేయటంలో గత యుపిఏ ప్రభుత్వానికంటే తాను నాలుగాకులు ఎక్కువ చదివానని ఎన్‌డిఏ నిరూపించుకుంది.

ఎన్‌డిఏ పాలకులు ఎంతటి ఆర్భాటపు నినాదాలు ఇస్తూన్నప్పటికీ, ఇటీవలి కాలంలో వారు ఆర్థికరంగంలో తీసుకున్న రెండు నిర్ణయాలు, వారి నిజవర్గ స్వభావాన్ని వెల్లడిచేస్తున్నాయి.

కోల్ ఇండియా లిమిటెడ్ అనే ప్రభుత్వరంగ సంస్థలో 10 శాతం వాటాలను అమ్మబోతున్నట్లుగా సెప్టెంబరు 10న కేంద్రమంత్రి వర్గం నిర్ణయించింది. అదేవిధంగా ఓఎన్‌జిసిలో 5 శాతం వాటాలను, ఎన్‌హెచ్‌పిసి అనే జల విద్యుత్తుకు చెందిన ప్రభుత్వరంగ సంస్థలో 11.4 శాతం వాటాలను అమ్మివేయాలని నిర్ణయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు లక్ష్యాన్ని అందుకోవటం కోసం ప్రభుత్వానికి సహాయపడేందుకు ఈవిధమైన నిర్ణయం తీసుకున్నట్లుగా చెప్తున్నారు. ఈవిధంగా ఎన్‌డిఏ ప్రభుత్వం బడ్జెట్టులో ద్రవ్యలోటును పూడ్చుకునేందుకు ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్మటాన్నే ఘనంగా చెప్పుకుంటోంది. ఎన్‌డిఏ ప్రభుత్వం ఏమి ప్రకటిస్తు న్నప్పటికీ, ఈ విధమైన నిర్ణయం ప్రైవేటీకరణకు మార్గాన్ని సుగుమం చేయటం మినహా మరోటికాదనేది వాస్తవం. ఇది, భారతదేశంలో ప్రభుత్వరంగ సంస్థల ఆస్తులను లూటీ చేయడమేగాక, దేశ, విదేశీ బడా పెట్టుబడిదారులకు చట్టబద్ధ హక్కులను కల్పించటమే! ప్రతిష్టాత్మకమైన ప్రభుత్వరంగ సంస్థలను బలిపీఠం ఎక్కించటం మినహా ఈ చర్య మరోటికాదు. కార్పొరేటు మార్కెటు శక్తులకు భారీస్థాయిలో పన్నురాయితీలు కల్పించే ప్రభుత్వ విధాన ఫలితమే బడ్జెట్టులో ఈ ద్రవ్యలోటు అనేది రహస్యమేమీ కాదు. తిరిగి మరలా ఈ ద్రవ్యలోటును పూడ్చుకునే పేరిట ఎన్‌డిఏ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల వాటాలను ప్రైవేటు వ్యాపారులకు అమ్మబోతున్నది. భారత, విదేశీ బడా కార్పొరేట్లకు దేశీయ వనరులను అదుపుచేసే అధికారాలను, వాటిపై ఆధిపత్యాన్ని కట్టబెట్టే పరోక్ష పద్ధతి ఇది. ఈలాంటి చర్య – విదేశీ పెట్టుబడిపై ఆర్థికంగా ఆధారపడే దుస్థితిని కల్పించటమేగాక నిరుద్యోగ సమస్యను మరింతగా పెంచుతుంది. ప్రజల మధ్య ఈ చర్య ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో తీవ్ర అసమానతలకు దోవతీస్తుంది. ప్రజల పరిస్థితులను మరింతగా దిగజార్చేందుకే ఈ చర్య మరింతగా దోహదపడుతుంది.

మరోవైపున, ప్రస్తుతం సాంవత్సరిక ఇపిఎఫ్ శాతం వినియోగ ధరల పెరుగుదలకంటే తక్కువ వుండటం వలన, ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఇపిఎఫ్ఓ) తన వాటాలను స్టాక్‌మార్కెట్లలో మదుపుచేయటం ద్వారా సభ్యులకు అధికమొత్తాలు తిరిగి అందుతాయనే భ్రమలు గొల్పుతూ వారిని అంగీకరింపచేసింది. మౌలిక సదుపాయాల కల్పన లోనూ, రియల్ ఎస్టేట్‌లోనూ ఇపిఎఫ్ఓ మదుపు చేస్తుందని చెప్తున్నారు. ఇపిఎఫ్ఓ మౌలిక సదుపాయాలు, రియల్ఎస్టేట్ రంగాల్లో తమ వాటాలను మదుపు చేయటానికి వీలుగా, ఎన్‌డిఏ ప్రభుత్వం 1882 నాటి ఇండియన్ ట్రస్టు చట్టాన్ని సవరించటానికి పూనుకుంటున్నది. ఈ చట్టం ప్రభుత్వ వ్యవస్థలలో మాత్రమే ప్రావిడెంట్ ఫండ్‌ను మదుపు చేయటానికి అనుమతిస్తున్నది. కాగా, కాలంచెల్లిన వలస కాలం నాటి చట్టాలను రద్దుచేసే పేరిట గంభీర పదజాలంతో ఎన్‌డిఏ ప్రభుత్వం ఈ చట్టసవరణకు పూనుకుంటున్నది.

ప్రస్తుతం 6.5 లక్షల కోట్ల రూపాయల ఇపిఎఫ్ కార్పస్ నిధులలోని 85 శాతం ప్రభుత్వ బాండ్ల రూపంలో మదుపుచేయబడగా, మిగిలిన నిధులు బ్యాంకులు, ప్రభుత్వరంగ సంస్థలు విడుదలచేసిన సెక్యూరిటీ బాండ్ల రూపంలో వున్నాయి.

సెప్టెంబరు 1 నుండి చట్టబద్ధంగా ప్రావిడెంట్ ఫండ్ నిధుల కోసం వేతనంపై పరిమితిని నెలకు 6,500 రూ॥ల నుండి రూ॥ 15,000కు పెంపు చేయటం ద్వారా ఇపిఎఫ్ఓ వద్దకు రాబడులు సంవత్సరానికి 60 వేల కోట్లకు పెరుగనున్నాయి. కనుక ప్రస్తుతం ఇపిఎఫ్ఓ తన వాటాలను స్టాక్‌మార్కెట్ జూదంలో మదుపుచేయటానికి ఆమోదం తెలపటంతో పెద్దమొత్తంలో కార్మికులు మదుపుచేసుకున్న నిధులన్నీ బడా పెట్టుబడిదారుల, ప్రైవేటు కార్పొరేట్ల చేతుల్లోకి మళ్ళించటమే జరగనుంది.

ఈవిధంగా కార్మికుల, ఉద్యోగుల భవిష్యనిధిని స్టాక్‌మార్కెట్‌లో జూదంగా పణంగా పెట్టడం ఫలితంగా యూరపుదేశాలలోను, అభివృద్ధి చెందుతున్న దేశాలలో కార్మికులను బికారులుగా మార్చిన చేదు అనుభవాలు కళ్ళెదురుగానున్నప్పటికీ ఇపిఎఫ్ఓ ఈ విధమైన నిర్ణయం తీసుకుంది.

విశాల కార్మికోద్యమ ప్రతిఘటన ద్వారా మాత్రమే ఈవిధమైన ప్రజావ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలకు అడ్డుకట్ట వేయగలగటం సాధ్యమౌతుంది. ✶

**కా॥ఎన్.వీ.కె...** (7వ పేజీ నుండి)

వీ.డి.ఏ సాధించేందుకు అనేక ఆటంకాలను ఎదుర్కొని దానిపై సూత్రబద్ధంగా నిలిచారని పేర్కొన్నారు. కామ్రేడ్ ఎన్.వీ.కేను ఆదర్శంగా తీసుకొని కార్మికోద్యమ నిర్మాణానికి పూనుకోవాలని పిలుపునిచ్చారు.

సిరిసిల్ల డైయింగ్ కార్మిక నాయకులు, కామ్రేడ్ నారాయణ, శ్యాంలు అప్పటి రైస్‌మిల్లు కార్మికుల సమ్మె సందర్భంగా నిర్బంధం మధ్య కామ్రేడ్ ఎన్.వీ.కే కార్మికులకు అండగా నిలిచిన తీరును గుర్తు చేసుకొన్నారు. సిరిసిల్లా అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా, కరీంనగర్ పార్లమెంటు ఎన్నికల సమయంలో, నిర్బంధం నడుమ సాగించిన ఎన్నికల ప్రచారాన్ని కామ్రేడ్ వెంకటేశం గుర్తుచేసుకొన్నారు. ఎంఎల్‌ఏగా ఎన్నిక అయ్యాక ప్రజాప్రతినిధిగా, పార్లమెంటేరియన్‌గా రాష్ట్ర వ్యాపితంగా కామ్రేడ్ ఎన్వీకే, సాగించిన ప్రచారాన్ని ఎన్‌వైఎస్ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ బి. రవీందర్ వివరించారు. కరీంనగర్‌జిల్లా గ్రానైట్, క్వారీ క్రషర్ కార్మిక యూనియన్, సిరిసిల్ల క్లాత్ సైజింగ్ మరియు డైయింగ్ కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో కార్మిక, ప్రజా ఉద్యమ నిర్మాణం కోసం కరీంనగర్ జిల్లాలో కార్మిక శక్తులందరు కృషి జరపాలని వక్తలు వివరించారు. కామ్రేడ్ ఎన్.వి.కేకి విప్లవజోహార్లు చెపుతూ అమరులైన వివిధ ప్రజా ఉద్యమకారులకు, ప్రజానాయకులకు నివాళులు అర్పించారు. ✶

# ముందుకు తోసుకొస్తున్న హిందూ మతతత్వ శక్తుల దౌర్జన్యపూరిత ఎజెండా

ప్రధానిగా నరేంద్రమోడీ వందరోజుల 'సుపరిపాలన' గురించి, 'జన్‌ధన్‌యోజన', 'స్వచ్ఛభారత్' వంటి పథకాల ప్రయోజనాల గురించి మోడీ అభిమానులు, బిజెపి మరియు దాని మిత్రపక్షాలు ఏమి చెప్తున్నప్పటికీ వివిధ రూపాలలో హిందూ మతతత్వ ఎజెండాను హిందూ మతతత్వశక్తులు దౌర్జన్యపూరితంగా ముందుకు తోస్తున్నాయనేది స్పష్ట మౌతోంది. అత్యధిక లోక్‌సభ స్థానాలను గెలుచుకొని, కేంద్రంలో బిజెపి ప్రభుత్వాధికారాన్ని చేపట్టింది కనుక, ఏదో ఒకవిధంగా తమ హిందూ మతతత్వ ఎజెండాను అమలులో పెట్టడానికి చట్టబద్ధహక్కులు తమకు సంక్రమించాయనే అభిప్రాయంతో హిందూ మతతత్వ శక్తులు వున్నాయనేది కూడా స్పష్టమౌతోంది.

పెరిగిపోతోన్న నిత్యావసరాల ధరలనదుపు చేయాలనే ప్రజల ఆశలు ఆవిరవుతున్నాయి. దీనికి భిన్నంగా ఎన్‌డిఏ ప్రభుత్వం రైల్వేఛార్జీల పెంపుదల, డీజిలు, వంటగ్యాసు ధరల పెంపు వంటి చర్యల ద్వారా ధరలను పెంచుతూ ప్రజలపై భారాలు మోపుతోంది.

మరోవైపున, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడిన 10 వారాలలోపునే, మతతత్వ ఘర్షణలు పెరుగుతూ వచ్చాయి. ఒక్క ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోనే, జాతీయ మీడియా కథనాల ప్రకారం, 605 మతతత్వ ఘర్షణల సంఘటనలు జరిగాయి.

స్వయానా ప్రధాని నరేంద్రమోడీ తన అధికార హోదాలోనే ఆర్‌ఎస్‌ఎస్ మరియు సంఘ్‌పరివార్‌ల ఎజెండా అమలుకు నడుం బిగించాడు. ప్రధాని ఇటీవల నేపాల్‌లో పర్యటించిన సందర్భంలో అక్కడి పశుపతినాథ్ గుడిలో కాషాయాంబరధారియై రుద్రాభిషేకం జరిపి 2500 కిలోల గంధాన్ని గుడికి కానుకగా సమర్పించటం – అధికారయుతంగా హిందూ మతతత్వ భావనల సూచనాత్మక వ్యక్తీకరణే!

ఆగస్టు చివరి వారంలో రక్షాబంధన్ మరియు జన్మాష్టమి పర్వదినాలను ప్రభుత్వాల ప్రత్యక్ష తోడ్పాటుతో చాలా ఆడంబరంగా నిర్వహించారు. ఈ పండుగల గురించి ప్రసార మాధ్యమాలలో ప్రత్యేకించి దూరదర్శన్‌లో అత్యధిక ప్రాచుర్యం కల్పించి ప్రసారం చేశారు. హిందూ మతతత్త్వ ఎజెండాను అధికారికంగా అమలు చేయబూనుకున్న ఉద్దేశ్యపూరిత చర్యలే ఇవన్నీ!

ప్రభుత్వం సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని 'గురోత్సవ్'గా పేరుమార్చాలని ప్రతిపాదించటంతోపాటు, ఉపాధ్యాయ దినోత్సవంనాడు ప్రధాని మోడీ విద్యార్థులనుద్దేశించి ప్రసంగించటమేగాక, దీనిని విద్యార్థులకు నిర్బంధంగా వినిపింపచేశారు. ఈ సందర్భంగా మోడీ చేసిన ప్రసంగంలో ఉపాధ్యాయులకు లేదా విద్యావిధానానికి సంబంధించిన అంశాలేమీ లేవు. పైగా దేశంలోని వివిధ ప్రాంతాలలో అనేకమంది విద్యార్థులకు అర్థంకాని హిందీభాషలో మాట్లాడి ప్రధాని వారిపట్ల అలక్ష్యం ప్రదర్శించారు. ఉపాధ్యాయ దినోత్సవంనాడు మోడీ చేసిన ప్రసంగం – ఆర్‌ఎస్‌ఎస్ ప్రాపంచిక దృక్పథాన్ని విద్యార్థుల మెదళ్ళలోకి జొప్పించేందుకు, అదేవిధంగా విద్యను అదుపుచేసే క్రమాన్ని ప్రారంభించేందుకు రాజకీయ అధికారాన్ని దుర్వినియోగపర్చటంగా రుజువైంది.

ప్రధానమంత్రి అధికారయుతంగా ఈవిధమైన సున్నిత పద్ధతులను అనుసరిస్తుండగా, ఆర్‌ఎస్‌ఎస్ మరియు సంఘ్‌పరివార్ సంస్థలు వివిధ రూపాల్లో తమ ఎజెండాను అమలుచేసేందుకు దౌర్జన్యయుత మార్గాన్ని చేపట్టాయి.

హిందూ బాలికలను ఇస్లాం మతంలోకి మార్పిడులుగా చెప్పబడేవాటికి వ్యతిరేకంగా పశ్చిమ ఉత్తరప్రదేశ్ ప్రాంత జిల్లాలలో ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థ అయిన 'రెలిజియస్ ఎవేకినింగ్' ఆధ్వర్యంలో ఆగస్టు 23 నుండి సెప్టెంబర్ 15 వరకు ప్రదర్శనలు నిర్వహించారు.

స్వామి శ్రద్ధానంద్ (19వ శతాబ్దపు పునః మతమార్పిడి ఉద్యమ నాయకుడు) మరణించిననాడైన డిసెంబర్ 23వ తేదీన పశ్చిమ ఉత్తరప్రదేశ్ ప్రాంతంలోని కనీసం 50 కేంద్రాలలో ముస్లిములను హిందువులుగా మతమార్పిడిజేసే కార్యక్రమం చేపడతామని ఆర్‌ఎస్‌ఎస్‌కే చెందిన మరో అనుబంధ సంస్థ 'ధర్మజాగరణ్' ప్రకటించింది. అలాగే డిసెంబర్ 25వ తేదీన – క్రిస్టమస్ నాడు – క్రిస్టియన్లను హిందూమతంలోకి మార్పిడి చేస్తామని ఈ సంస్థ ప్రకటించటంతోపాటుగా 'హిందువులో, వారో ఎవరు బలవంతులో తేల్చుకోవటానికి ఇదో పరీక్ష. అందరూ వేచి చూడండి' అని ప్రకటించింది. ఈవిధంగా బిజెపి, సంఘ్‌పరివార్ శక్తులు 'లవ్‌జీహాద్'గా చెప్పబడుతున్న దానికి వ్యతిరేకంగా తమ ప్రచారాన్ని తీవ్రతరం చేశారు.

ఆగస్టు మొదటివారంలో విశ్వ హిందూ పరిషత్ నాయకుడు ప్రవీణ్ తొగాడియా 'హిందూ హెల్ప్‌లైన్' అనే ఓ కాల్‌సెంటర్‌ను ప్రారంభించాడు. ఈ కాల్‌సెంటర్‌కు ఫోన్‌చేస్తే ప్రజల సందేహాలను నివృత్తి చేయటంతోపాటు హిందూ బాలికలను 'రక్షించుకునేందుకు' న్యాయపరమైన సలహాలను అందచేస్తారు. ఇలాంటి కాల్‌సెంటర్‌లను పూనేతోపాటుగా ఢిల్లీతోసహా 50 నగరాలలో ఏర్పాటు చేయనున్నారు.

ఈ హిందూ హెల్ప్‌లైన్ కాల్‌సెంటర్లు హిందూ మతాచారాలకు సంబంధించి సలహాలందిచటంతోపాటు 'ముస్లిమ్ యువకులచే మీ కూతురు వేధింపులకు గురైతే ఏం చేయాలి?' వంటి సమస్యల సందర్భాలలో దిశానిర్దేశం చేయటానికి ఉద్దేశించబడ్డాయని, భారత దేశంలో హిందువులకు ఈలాంటి సేవల అవసరం వుందని విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు నొక్కి చెప్తున్నారు.

ముంబయిలో విహెచ్‌పి స్వర్ణోత్సవాల సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతవేత్త మోహన్ భగవత్ హిందూ జాతి అనే తమ సిద్ధాంత అవగాహనను పునరుద్ఘాటించాడు. హిందూయేతరులైన వారు ఈ దేశంలో రెండవ శ్రేణి పౌరులుగా ఎలాంటి పౌర హక్కులూ లేకుండా నివశించాలని స్పష్టంగా చాటి చెప్పిన ఎమ్‌ఎస్ గోల్వాల్కర్ రచించిన 'వుయ్ ఆర్ అవర్‌నేషన్ హుడ్ డిఫైన్‌డ్' అనే పుస్తకంలో ఈ హిందూ జాతి గురించి వివరంగా విశదీకరించిన విషయాన్నే మోహన్ భగవత్ నొక్కిచెప్పాడు. 'హిందూస్థాన్‌లో నివసించేవారంతా హిందూస్థానీలు మాత్రం కాదని, హిందువులేన'ని ఆయన పేర్కొన్నాడు. ఈరకమైన ప్రతిపాదన శతాబ్దాలుగా శాంతి సామరస్యాలతో సహజీవనం చేస్తున్న భిన్న సమూహాలను చిన్నాభిన్నం చేస్తుంది.

ముంబయ్‌లోని సెయింట్ గ్జేవియర్ పాఠశాలలో నృత్యం, సంగీతాల వార్షికోత్సవాలలో పాల్గొనేందుకు కబీర్ కళామంచ్‌కు చెందిన శీతల్‌సాథేను ఆహ్వానించారు. ఆహ్వానితులంతా కిక్కిరిసిన విద్యార్థులతో నున్న హాల్‌లో వేదికపై వుండగా, 'జాతీయ ప్రయోజనాల' మేరకు శీతల్‌సాథే ఆహ్వానాన్ని ఉపసంహరించుకోవాలని ఏబివిపికి చెందిన విద్యార్థులు కొందరు బెదిరించారు. వార్షికోత్సవ పోస్టర్లలో ఉపన్యాసకుల ముఖాలకు వారు నలుపురంగు పులిమారు. దీనితో శీతల్‌సాథే గౌరవప్రదంగా ఈ వేడుకలలో పాల్గొనకుండా తప్పుకుంటూ తాను విద్యార్థుల ప్రేమాభిమానాలను కోరుకుంటున్నానని, కళాశాలలో తాను ఉపన్యసించి, పాటలుపాడి 'అసహ్యకర బెదిరింపులతో విచ్ఛిన్నానికి పాల్పడే వారికి అవకాశం కల్పించదలచుకోలేదని' ప్రకటించింది.

జాతీయ తీవ్రవాద సంస్థ అయిన 'హిందూ సమితి' ఆధ్వర్యంలో, బెంగాల్ చరిత్రలో ఘోరమైన మతకల్లోలాలు జరిగిన ఆగస్టు 16నాడు గోపాల్‌చంద్ర ముఖర్జీ శతజయంతి వేడుకలను నిర్వహించారు. వాస్తవానికి బెంగాల్ చరిత్రలో 1946 మతఘర్షణలలో గోపాల్‌చంద్ర ముఖర్జీ స్వయంగా పాల్గొన్నాడు. అతను ఓ నిఖార్సైన విచ్ఛిన్నకారుడు. కానీ ఈ అతితీవ్ర జాతీయవాద సంస్థ 'హిందూ సమితి' అతనిని 'జాతీయవాదిగా, దేశభక్తునిగా' కొనియాడుతున్నది.

ఆగస్టు 30న, 'జ్ఞానయజ్ఞ' పేరిట పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో ఆర్థికంగా బలహీన కుటుంబాలలోని 'మంచి విద్యార్థులకు' ఇంజనీరింగ్ శిక్షణా తరగతులను ప్రారంభించటానికి బిజెపి పథకం వేసుకుంది. ఉత్తర భారతంలోని హిందీ భాష మాట్లాడే కీలక ప్రాంతంలో ఆధిపత్య హిందూ వ్యవసాయ కులాలలోని; ఓబిసిల లోని, దళితులలోని విద్యార్థులను సమీకరించి శిక్షణ నివ్వటమనే పేరుతో పార్టీకి నూతన పునాది మద్దతును కూడగట్టుకోదలుచుకుంది.

ప్రధాని హాజరైన బహిరంగసభలో హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులను బిజెపి కార్యకర్తలు ఎగతాళిచేసి, అవమానించారు. ఈ చర్య – అధికారంలోనున్న ఇతర పాలకవర్గ పార్టీల నాయకులపట్ల సైతం హిందూ మతతత్త్వ శక్తులు అసహనాన్ని వ్యక్తంచేసే ధోరణిని వెల్లడిచేస్తోంది.

ఆగస్టు 28న, పంజాబు రాష్ట్రం – మొహాలి జిల్లా –ఔలానాకలాన్ గ్రామానికి చెందిన స్వామిపరమానంద కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో విద్యనభ్యసిస్తున్న కాశ్మీరీ విద్యార్థులపై ఇతర విద్యార్థులు దాడిచేసి కొట్టారు. కళాశాల హాస్టల్‌లోని టీవీ రూమ్‌లో పాకిస్తాన్–శ్రీలంకల నడుమ ఒకరోజు అంతర్జాతీయ మ్యాచ్ జరుగుతుండగా, కాశ్మీరీ విద్యార్థులు పాకిస్తాన్ క్రికెట్టు జట్టుకు అనుకూలంగా హర్షధ్వానాలు చేయటమే వారిపై దాడికి కారణంగా వుంది. పైగా, ఆ కాలేజీకి చెందిన 30 మంది విద్యార్థులతో కలిసి లబ్రూకు చెందిన బిజెపి నేతలు చండీఘడ్ – అంబాలా జాతీయ రహదారిని దిగ్బంధించి, పాకిస్తాన్ జట్టుకు అనుకూలంగా హర్షద్వానాలు చేసిన 8 మంది కాశ్మీర్ విద్యార్థులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మహారాష్ట్ర, జమ్మూ–కాశ్మీర్, ఢిల్లీ, హర్యానా, ఝార్ఖండ్‌లలో జరుగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని హిందూమతతత్వశక్తులు 'లవ్‌జీహాద్'గా పిలవబడుతున్న దానిపై యుద్ధాన్ని ప్రకటించారు. ముస్లిము యువకులకు, హిందూ యువతులకు మధ్య వివాహాలు జరిగిపోతున్నాయంటూ, వారి వాదనకు తగిన ఖచ్చితమైన ఆధారాలను వేటినీ చూపకుండానే ఊహాజనితమైన 'లవ్‌జీహాద్'పై యుద్ధాన్ని ప్రకటించారు. హిందూ మతతత్వ సంస్థల తీవ్ర ప్రయత్నాల ద్వారా ఈ భావన విస్తృత ప్రాచుర్యం పొందింది. ఇది భారత సమాజానికి తీవ్రహానిని కలిగిస్తోంది.

స్వామి వివేకానంద, మదనమోహన మాలవ్య తదితరులతోపాటుగా జనసంఘ్ ప్రముఖనేత దీన్ దయాళ్ ఉపాధ్యాయ చేసిన సేవలను గుర్తించేందుకు, పరిశోధనా కేంద్రాలను ఆయన పేరున అంకితమిచ్చేందుకు విశ్వవిద్యాలయాల గ్రాంట్స్ కమీషన్ (యుజిసి) ఓ పథకాన్ని ప్రారంభిస్తున్నది. కాశ్మీరీ పండిట్లకు భూములు ఇవ్వవలసిందిగా కేంద్ర హోంశాఖామంత్రి రాజనాథ్‌సింగ్, కాశ్మీరు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాను కోరాడు. ఇది – జమ్మూకాశ్మీర్‌లో ఉనికిలో లేని హిందూ – ముస్లిము సమస్యను రాజకీయ అంశంగా మలచి అనవసర చర్చలను లేవనెత్తేందుకు ఉద్దేశించినదే.

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం – ఇండోర్ ఎమ్‌ఎల్‌ఏ ఉషాఠాకూర్ అక్టోబర్ 6న ఉత్తర భారతంలోని పలు రాష్ట్రాలలో నిర్వహించే గుజరాతీ నృత్యవేడుక 'గార్బా'లో ముస్లిములను పాల్గొననీయరాదని కోరింది. 'గార్బా సందర్భంగా సగటున ప్రతి సం॥రం నాలుగు లక్షల మంది హిందూ బాలికలు ఇస్లాం మతంలోకి మారిపోతున్నారనే' తన స్వీయ సమాచారం ప్రాతిపదికగా ఆమె ఈ నిషేధాన్ని కోరుతోంది. ఈవిధమైన వివాదాస్పద చర్యల ద్వారా బిజెపి హిందూ మతతత్వ ఎజెండాను ముందుకు తోస్తోంది.

ఇలాంటి తప్పుడు ఆరోపణలను సమర్థిస్తూ గుజరాత్ రాష్ట్ర విశ్వహిందూ పరిషత్, రాష్ట్ర వ్యాపితంగా 'లవ్‌జీహాద్'కు వ్యతిరేకంగా గోడ పత్రికలను ప్రచురించింది. 'ముస్లిము యువకులు ధనిక, పేద హిందూ యువతులను తమ మోటారు వాహనాలపై తిప్పి, ప్రలోభపరచి, వారిని తమ రెండో లేదా మూడో భార్యగానో చేసుకొని ఆపై వారిని వేశ్యా వృత్తిలోకి దించుతారని, ముస్లిము గూండాలకు హిందూ బాలికలను లోబరుచుకునే శిక్షణతోపాటు కోట్లాది రూపాయల నిధులు కూడా అందుబాటులోకి తెస్తున్నారని వారు ప్రచురించిన కరపత్రంలో తీవ్రమైన, దుర్మార్గమైన తప్పుడు ఆరోపణలు చేశారు.

మతతత్వ హింస పెరుగుదల అంశంపై లోక్‌సభలో జరిగిన చర్చలో బిజెపి తరపున చర్చకు నాయకత్వం వహించిన గోరఖ్‌పూర్ ఎం.పి. యోగి ఆదిత్యనాథ్ 22 నిముషాలపాటు రెచ్చగొట్టే, దౌర్జన్యపూరితమైన ప్రసంగంచేస్తూ హిందూమతతత్వ ప్రాపంచిక దృక్పథాన్ని సమర్థించాడు. ఈ బిజెపి నాయకుడు 'హిందూ వాహిని' అనే ఓ హిందూ మతతత్వ సంస్థ వ్యవస్థాపకుడేగాక, రామజన్మభూమి ఉద్యమంలో, బాబ్రీ మసీదు విధ్వంసంలో ప్రత్యక్షంగా ఒక ప్రముఖపాత్ర పోషించినవాడు కూడా!

ఢిల్లీ ఆర్ట్ గ్యాలరీతో కలసి హోటల్ మారియట్ ఆతిధ్యంలో నిర్వహిస్తున్న 'మానిఫెస్టేషన్స్ – XI' నుండి ఎం.ఎఫ్.హుస్సేన్ చిత్రించిన వినాయకుడి చిత్రపటం పట్ల కొందరు అతిథులు 'అభ్యంతరం' తెలియచేశారంటూ, ఎవ్వరి భావాలూ గాయపడకుండా ఉండేందుకంటూ, ఆ చిత్రపటంలో తప్పేమీలేకున్నా హోటల్ నిర్వాహకులు ఆ చిత్రకళా ప్రదర్శన నుండి దానిని తొలగించారు.

మతతత్వ దాడులను మైనారిటీ ప్రజలతో తప్పుగా ముడిపెట్టి ఇండియా టి.వి. ప్రసారం చేసిన 'ఆప్‌కి అదాలత్' కార్యక్రమంలో బిజెపి ఎం.పి యోగి ఆదిత్యనాథ్ మాట్లాడాడు: "ఎక్కడైతే 10 నుండి 20 శాతం మైనారిటీలు వుంటారో అక్కడ చెదురుమదురు మతపరమైన ఘర్షణల సంఘటనలు జరుగుతాయి; ఎక్కడైతే 20 నుండి 35 శాతం మైనారిటీలు వుంటారో తీవ్రమైన మతతత్వ దాడులు అక్కడ జరుగుతాయి; ఎక్కడైతే 35 శాతానికి మించి మైనారిటీలు వుంటారో అక్కడ ముస్లిమేతరులకు స్థానమే వుండదంటూ" ఈ కార్యక్రమంలో అతను ఏవిధమైన చట్టభీతీ లేకుండా విద్వేషాగ్నులు రగిలించే వ్యాఖ్యలను చేశాడు.

అక్టోబరులో జరుగనున్న బక్రీద్ సందర్భంగా ముంబయిలోని విహెచ్‌పి, గోవధను అరికట్టే కార్యక్రమాన్ని ప్రకటించింది. ఆవుల రవాణాపై మెరుపు బృందాలతో ఆకస్మిక తనిఖీలు జరపటానికి కొన్ని కేంద్రాలను ఏర్పరచింది. 'ప్రభుత్వ పాలనాయంత్రాంగం తొలుత మా కార్యకలాపాలకు అడ్డుపడినా అది ఎంతోకాలం కొనసాగదు. దేశవ్యాపిత పాలనా యంత్రాంగం నుండి మేము సహకారం పొందుతున్నామ'ని వెంకటేష్ అప్‌డియో అనే ఓ విహెచ్‌పి కేంద్రకమిటీ సభ్యుడు నొక్కిచెప్పాడు. 'మోడి హిందూ మతతత్త్వ పరిరక్షకుడు' 'హిందువులంతా ఒక్కటే' నినాదం మాటున విహెచ్‌పి క్రింది కులాలలో తన ప్రాపకాన్ని విస్తరించుకునే ప్రయత్నం చేస్తోంది. 'ఘర్ వాపసి' (మతమార్పిడి చేసుకుని తిరిగి హిందువులుగా మారటం) వంటి విస్తృత పథకాలతో విహెచ్‌పి ముందుకు వెళ్తోంది. గత 50 సంవత్సరాల కాలంలో తమ సంస్థ 7 లక్షల మంది హిందువులను మతమార్పిడులతో తిరిగి హిందూ మతంలోకి చేర్చుకుందని ప్రవీణ్ తొగాడియా ప్రకటించగా, 'ఈ సంఖ్య భవిష్యత్తులో కోట్లకు చేరవచ్చు' అని అప్‌డియో వ్యాఖ్యానించాడు.

'మదర్సాలు తీవ్రవాదుల, జీహాదుల ఉత్పత్తి కేంద్రాలుగా వున్నాయ'ని 'మదర్సాలలో తీవ్రవాదాన్ని ప్రబోధించే విద్యను నేర్పుతున్నారని' 'ఈలాంటి సంస్థల ద్వారానే 'లవ్‌జీహాద్' ముందుకు సాగుతోందని' ప్రకటించటం ద్వారా బిజెపి ఎంపి సచ్చిదానంద సాక్షి మహరాజ్, రేగుతున్న 'లవ్‌జీహాద్' మంటలను మరింత ఎగదోశాడు.

మోడి ప్రభుత్వం మరియు మోడీ కుట్రపూరితంగా ఈలాంటి విద్వేషాలను పెంపొందించే వ్యాఖ్యలు, ఉపన్యాసాల పట్ల మౌనం వహిస్తున్నారు. ఈ దుష్ప్రచారాన్ని నిరోధించటానికి ప్రభుత్వమేమీ చేయటంలేదు.

ఈవిధంగా హిందూమతతత్త్వ శక్తులు తమ తిరోగమన, ప్రతీఘాతక ఎజెండాను దౌర్జన్యపూరితంగా ముందుకు తీసుకెళ్ళటంద్వారా దేశాన్ని ఫాశిజంవైపుగా నెడుతున్నారు. సమాజంలోని అన్ని పార్శ్వాలలోకి ఈ హిందూమతతత్త్వ భావజాలాన్ని జొప్పించి పెడదోవ పట్టించటాన్నుండి దేశాన్ని రక్షించుకునేందుకు హిందూ మతతత్వశక్తుల ఈ చర్యలన్నింటికి వ్యతిరేకంగా ప్రగతిశీల శక్తులు గమనింపుతోనూ, అప్రమత్తంగానూ వుంటూ సంఘటితం కావాల్సి వుంది. ✱





**మతోన్మాదం - సామ్రాజ్యవాదం - భారత పాలకులు**

(వ్యాస సంకలనం)

**పేజీలు : 80** **వెల : రు. 30/-**

కాపీలకు :

**మైత్రీబుక్‌హౌస్**

జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్,

విజయవాడ–2

## నూతన ప్రజాస్వామిక... (8వపేజీ నుండి)

దయనీయస్థితిగతులనుండి బయటపడేందుకు వారి పైనున్న బాధ్యతను, కర్తవ్యాలను పునశ్చరణ చేసుకొని అందుకు పూనిక వహించేందుకు అఖిలభారత కార్మిక సదస్సును నిర్వహిస్తున్న నేపథ్యాన్ని వివరించారు.

గత రెండు దశాబ్దాల కాలంగా నాటి యుపిఏ, నేటి ఎన్‌డిఏ ప్రభుత్వాల పాలనాకాలంలో అమలుచేస్తూ వస్తోన్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలన్నీ ప్రజల జీవితాలను మరింత దుర్భరస్థితిలోకి పడ దోశాయన్నారు. అభివృద్ధిముసుగులో, గౌరవప్రదమైన జీవనం పేరిట వారు చేపడ్తున్న చర్యలన్నీ బడాసంపన్న వర్గాల ప్రయోజనాలకు తోడ్పడేవేనన్నారు.

మారుతి మానేసర్ ప్లాంటులో కార్మికులకు కనీసం యూనియన్ పెట్టుకునే హక్కును కూడా నిరాకరించిన యాజమాన్యం, పాలకులు కార్మికులపై తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈనాటికీ 170 మంది మారుతీ కార్మికులను ఉద్యోగాలనుండి తొలగించటమేగాకుండా వారంతా బెయిల్‌కూడా నిరాకరించబడుతూ జైళ్ళలో మగ్గుతున్న విషయాన్ని దృష్టికి తెచ్చారు. భారతదేశంలో సామ్రాజ్యవాద ప్రపంచీకరణ దుష్ఫలితాలలో మారుతీ సుజికీ కార్మికుల నేటి దుస్థితిని ఒక ఉదాహరణగా కా॥అరవిందసిన్హా పేర్కొన్నారు.

సహజ, ఖనిజ సంపదలు అశేషంగావున్న మన దేశంలోకి అభివృద్ధిపేరిట బహుళజాతి పరిశ్రమలను, వారి పెట్టుబడులను ధారాళంగా అనుమతిస్తున్నారు. అటవీప్రాంతాలనుండి ఆదివాసులు, గ్రామీణప్రాంతాల నుండి రైతులు, రైతుకూలీలు తరిమివేయబడుతున్నారు. వలసకార్మికుల సంఖ్య అనూహ్యంగా పెరుగుతుండగా మరోవైపున మనదేశంలో వందలకోట్లకు ఎగబాకిన బడా సంపన్నుల సంఖ్య పెరుగుతోంది. ఒకవైపునూటికి 70మందికి పైగా ప్రజానీకానికి కనీసపాటి ఆహారం అందటంలేదని ప్రభుత్వమే ప్రకటిస్తోంది. పిల్లలకు విద్య అందటంలేదు–పిల్లలలో రక్తహీనత తీవ్రసమస్యగా వుంది; ధరలు అనూహ్యంగా పెరిగిపోతున్నాయని ఆయన వివరించారు.

బడాపెట్టుబడిదారులకు, బహుళజాతి కంపెనీలకు లక్షలకోట్ల పన్నుబకాయిలను, అప్పులను రద్దుచేయగలుగుతున్న పాలకులకు– రైతాంగానికి సంస్థాగత రుణాలందజేయటానికి, సబ్సిడీలలో కోతలు లేకుండా కొనసాగించటానికి, వారి రుణాల మాఫీకి చేతులు రాకపోవటం వారి వర్గస్వభావంగా అర్థం చేసుకోవాలన్నారు. ఎన్నికలలో లబ్ధిపొందేందుకు అనేక ప్రజాకర్షక చిట్కాలు ప్రయోగించే పాలకవర్గ పార్టీలన్నీ దోపిడీవర్గాల ప్రయోజనాలకే కొమ్ముగాస్తున్నాయనేది స్పష్టమౌతోందన్నారు.

కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను పాలకులు ఈపాటికే నిర్వీర్యం చేస్తూవుండగా, చట్టబద్ధంగా కార్మిక సంస్కరణల పేరిట మోడీ ప్రభుత్వం, కార్మికుల కనీసపాటి హక్కులనుకూడా కాలరాచివేయబూనుకోవటాన్ని కా॥ అరవిందసిన్హా తీవ్రంగా గర్హించారు.

ఈ నేపథ్యంలో కార్మికవర్గంమీదున్న కర్తవ్యాల గురించి వివరిస్తూ ఆర్థికడిమాండ్లపై కార్మికులు విడివిడిగా సాగించే ఒకటో, అరో సమ్మె పోరాటాలు ఈ పాలకులను కదిలించలేవన్నారు. 1974లో రైల్వే కార్మికుల సంఘటిత పోరాట సానుకూల అనుభవాలని గుర్తుచేసుకోవాలన్నారు. ఒక రంగంలో సంఘటితంగా సమ్మె జరిగితేనే ప్రభుత్వం దిగివచ్చిందని, అలాంటిది సమస్త రంగాల కార్మికవర్గం ఐక్యంగా, సంఘటితంగా పోరాడితే పాలకుల మెడలువంచగలుగుతామన్నారు. అన్ని రంగాల ట్రేడుయూనియన్లు ఐక్యంగా దోపిడీ ప్రభుత్వాల అంతుతేల్చుకునే విధంగా సమరశీలంగా నిలబడినప్పుడే దోపిడీ పాలకులు లొంగివస్తారన్నారు. ఇందుకు వివిధ ట్రేడుయూనియన్లు ఒక వేదిక మీదకు రావలసిన అవసరాన్ని కా॥అరవిందసిన్హా నొక్కి చెపుతూ నూతన ప్రజాస్వామికం, సామ్యవాద వ్యవస్థల సాధనకోసం కార్మికులు వర్గ పోరాటాలను తీవ్రం చేయాలని పిలుపునిచ్చారు.

**కార్మిక, ప్రజాఉద్యమాల మిత్రులు, వ్యవసాయార్థికశాస్త్రవేత్త ప్రొఫెసర్ కె.ఆర్.చౌదరి** మాట్లాడుతూ కార్మికుల పోరాటాలకు తన మద్దతును తెలియజేశారు. వినాశకర ప్రపంచీకరణ విధానాల తీవ్రత పెరుగుతోందని, ప్రభుత్వరంగ సంస్థలు తెగనమ్మివేయబడుతున్నాయని ఆయన గణాంకాలతో వివరించారు. పదిలక్షలకు పైగా చిన్న కంపెనీలు మూతబడిపోయాయని, ఆయా పరిశ్రమలలోని కార్మికులు, వారి కుటుంబాలు రోడ్లపైకి విసిరివేయ బడ్డారని ఆయన పేర్కొన్నారు.

దేశంలో అత్యధికులుగా నున్న రైతు, రైతుకూలీల దుర్భర స్థితిగతులను వివరిస్తూ దేశంలో ఇప్పటికే 45శాతం కుటుంబాలకు భూమే లేకపోగా గత 10 ఏళ్ళలో 19 శాతం భూమి రైతుల చేతుల నుండి బదలాయింపు జరిగిందని, విశాల భూఖండాలను వివిధ పేర్లతో బడా కార్పొరేటు సంస్థలు హస్తగతం చేసుకోవటానికి పాలకులు అనుమతులిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయంలో సామ్రాజ్యవాదుల చొరబాటు నానాటికీ పెరిగిపోవటాన్ని వివరిస్తూ మార్క్సిజం – లెనినిజం – ప్రాతిపదికగా, భూమి కేంద్రంగా సాగించే పోరాటాల ద్వారానే మన దేశంలో రైతాంగం, శ్రామికవర్గ విముక్తి సాధ్యమని ఆయన తన ఉపన్యాసంలో పేర్కొన్నారు.

**ఏఐకెఎమ్‌కెఎస్ కన్వీనర్ కా॥ సుబోధ్ మిత్ర** మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యూడల్ సంబంధాలు బలీయంగా వున్నాయని, ఫ్యూడల్ అణచివేత రూపాలైన కులవివక్ష, అంటరానితనం తదితరరూపాలు ఈనాటికీ కొనసాగుతున్నాయన్నారు. ఈ దేశంలో ఫ్యూడలిజాన్ని తమ పునాదిగా చేసుకొని సామ్రాజ్యవాదులు సాగిస్తున్న దోపిడీ కారణంగానే వ్యవసాయ, పారిశ్రామికరంగాల్లో సంక్షోభం నెలకొందని గుర్తుచేశారు. దున్నేవానికే భూమి నినాదంతో సాగిన తెలంగాణా రైతాంగపోరాటం, నక్సల్బరీ, శ్రీకాకుళం తదితర పోరాటాల వెలుగులో పీడిత ప్రజాఉద్యమాలు నిర్మించాల్సిన అవసరంతోపాటు కార్మిక – రైతాంగ మైత్రి యొక్క ఆవశ్యకతను కా॥ సుబోధ్‌మిత్ర నొక్కిచెప్పారు.

ఏఐఎఫ్‌టియు(న్యూ) అఖిలభారత సదస్సు విజయవంతం కావాలని **ఐఎఫ్‌టియు జాతీయ అధ్యక్షులు కా॥డి.వి.కృష్ణ** ఆకాంక్షించారు. ఆయన తన సందేశంలో ప్రపంచ ఆర్థిక సంక్షోభం మనదేశంలో కార్మికులు, రైతాంగంపై తీవ్ర దుష్ఫలితాలను చూపుతోందని, వారంతా చావో, రేవో తేల్చుకోవాల్సిన స్థితికి నెట్టబడుతున్నారన్నారు. ఈ భౌతిక పరిస్థితులు అనుకూలంగా వున్నప్పటికీ స్వీయాత్మకంగా వెనుకబడి వున్నామని, కార్మికుల సమస్యలపై స్పందించే వారందరం కలసి సమీక్షించుకొని ఒక బలమైన ఐక్య ఉద్యమ నిర్మాణం కోసం కృషిచేయాలని ఆయన తన సందేశంలో కోరారు.

**ఏఐసిటియు నాయకులు కా॥వెంకటరెడ్డి** ఈ సదస్సులో సందేశమిస్తూ వర్గ స్పృహతో పనిచేసే ట్రేడ్ యూనియన్లను ఈ వేదికపైకి ఆహ్వానించాలనే ఏఐఎఫ్‌టియు(న్యూ) నిర్ణయాన్ని స్వాగతించారు. పాలకుల దోపిడీవర్గ భావజాలాన్ని శక్తివంతంగా ఎదుర్కోవాలని కోరుతూ, కార్మికవర్గానికి దిశనిర్దేశం చేసేందుకు ఈ సదస్సు దోహదపడాలని ఆశాభావాన్ని వ్యక్తంచేశారు.

**ఐఎఫ్‌టియు రాష్ట్ర కోశాధికారి కా॥అనూరాధ** మాట్లాడుతూ చికాగో పోరాటంవంటి చారిత్రక పోరాటాలు తిరిగి జరగాల్సిన పరిస్థితులు నేడున్నాయన్నారు. రాబోవు కాలంలో ఐక్య ఉద్యమాలు మినహా మరో ప్రత్యామ్నాయంలేదని అభిప్రాయపడుతూ కార్మికుల అఖిలభారత సదస్సు ఈ పరిస్థితుల నేపథ్యంలో కార్మికులకు మార్గనిర్దేశం చేసేదిగా వుండాలని ఆకాంక్షించారు.

తమిళనాడు, ఒడిషా, ఝార్ఖండ్, బీహార్, ఢిల్లీ, పశ్చిమబెంగాల్, కేరళ, మహారాష్ట్ర, తదితర రాష్ట్రాల నుండి కార్మికరంగ ప్రతినిధులతోపాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల నుండి మూడువేలమందికిపైగా కార్మికులు, శ్రామికవర్గ ప్రజానీకం ఈ సదస్సులో పాల్గొన్నారు.

ప్రజా కళాకారులు అమరవీరులపై, కార్మిక సమస్యలపై విప్లవ గీతాలాలపించారు.

ప్రారంభసభ అనంతరం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నుండి ఏఐఎఫ్‌టియు(న్యూ) జెండాలు, బ్యానర్లతో వేలాదిమంది కార్మిక ప్రజానీకం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఏఐఎఫ్‌టియు(న్యూ) కేంద్ర నాయకత్వం ప్రదర్శన అగ్రభాగాన నడిచింది.

సదస్సు రెండవరోజున స్థానిక సుందరయ్య విజ్ఞానకేంద్రంలో కార్మిక ప్రతినిధులతో ఉదయం 10 గం॥ల నుండి సాయంత్రం 6 గం॥ల వరకు సదస్సు కొనసాగింది. ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కామ్రేడ్స్ శశియాదవ్, షమి, కమల్ కిషోర్ యాదవ్, రోబి అరయక్కండి – అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు.

సదస్సులో తొలుత **'క్లాస్ స్ట్రగుల్' పత్రిక సంపాదకులు డా॥ పి. జస్వంతరావు** మాట్లాడుతూ నూతన ప్రజాస్వామిక వ్యవస్థ సాధనకోసం యావత్ కార్మికవర్గం ఐక్యపోరాటాలు సాగించాల్సిన చారిత్రక అవసరాన్ని వివరించారు. నూతనంగా కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నరేంద్రమోడి 'మేక్ ఇండియా' అని పిలుపునిస్తూ ఈ దేశపు ముడిసరుకును, కార్మికుల శ్రమశక్తిని కారుచౌకగా ఉపయోగించి ఈ దేశంలో సరుకును తయారుచేసి విదేశాలకు ఎగుమతి చేయటానికి, ఆయా బహుళజాతి కంపెనీలు లాభాలు సముపార్జించటానికి వీలుగా జపాన్, అమెరికా తదితర దేశాల బడాపెట్టుబడిదారులందరికీ పిలుపునివ్వటాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. మొదటి ప్రయత్నంలోనే అంగారకగ్రహంపైకి ఉపగ్రహాన్ని పంపగలిగిన శాస్త్ర పరిజ్ఞానాన్ని ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు ఉపయోగించకపోవటాన్ని ఆయన ఎత్తిచూపారు. భారత ప్రజల అవసరాలు తీర్చే పరిశ్రమలన్నీ నష్టాలలో నడుస్తుండగా, సంపన్నుల అవసరాలుతీర్చే పరిశ్రమలు భారీలాభాలు గడిస్తున్నాయన్నారు. భారతదేశం లౌకిక రాజ్యమంటూనే తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు బతుకమ్మ, దసరాలను రాష్ట్ర పండుగలుగా ప్రకటించటంలోనే పాలకుల 'లౌకిక విధాన' బండారం బట్టబయలవుతోందన్నారు. దేశ ప్రజలను అణచివేతకు గురిచేస్తోన్న సామ్రాజ్యవాద, భూస్వామ్యాలను కూలదోయకుండా, నూతన ప్రజాస్వామికం, సోషలిజాలను సాధించకుండా కార్మికులకు, యావన్మంది శ్రామిక ప్రజానీకానికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలతో, ఆత్మగౌరవంతో, సుఖ సంతోషాలతోకూడిన జీవితాలు సాధ్యంకాదని స్పష్టం చేశారు. అందుకోసం, ఆ పోరాటాలకు నాయకత్వం వహించాల్సిన చారిత్రక బాధ్యత కార్మికవర్గంపై వుందని పేర్కొంటూ డా॥ జస్వంతరావు తన ప్రసంగం ముగించారు.

**ఏఐఎఫ్‌టియు(న్యూ) అధ్యక్షులు కా॥ జి. విజయ కుమార్** మాట్లాడుతూ భారతదేశంలో సామ్రాజ్యవాదంతో మిలాఖత్ అయిన బూర్జువావర్గం భారత సమాజాన్ని మృత సమాజంగా, అంధయుగంగా మార్చబూనుకుందన్నారు. ప్రజాస్వామిక కర్తవ్యాన్ని వదిలి వేసిందన్నారు. ఈ కర్తవ్య నిర్వహణకు, నూతన ప్రజాస్వామిక విప్లవ సాధనకోసం సంఘటితం

**(తరువాయి 5వ పేజీలో)**

1. కార్మిక చట్టాలలో సవరణలను వ్యతిరేకిస్తూ....

a) పారిశ్రామిక వివాదాల చట్టం (IDA)

గతంలో 100 మంది కార్మికులున్న పరిశ్రమలలో కార్మికులను తొలగించాలంటే ప్రభుత్వ అనుమతి అవసరం అనే నిబంధనను తొలగించి 100 మంది స్థానంలో 300 మందిగా ఆ పరిమితిని పెంచటానికి ప్రయత్నిస్తున్నారు.

b) ట్రేడ్ యూనియన్ల చట్టం

గతంలో 7గురు కార్మికులుంటే ట్రేడ్ యూనియన్ రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి, కార్మిక సమస్యలపై ప్రాతినిధ్యం వహించడానికి అవకాశం ఉండగా ప్రస్తుతం ట్రేడ్ యూనియన్ రిజిస్ట్రేషన్ చేయాలంటే 30%గా పరిమితి పెంచుతూ చట్టసవరణకు ప్రయత్నిస్తున్నారు.

c) ఫ్యాక్టరీ చట్టం (1947)

గతంలో విద్యుత్ సౌకర్యంతో 10 మంది; విద్యుత్ సౌకర్యం లేకుండా 20 మంది కార్మికులు పనిచేస్తే ఫ్యాక్టరీ చట్టం వర్తించేది. కాగా, ప్రస్తుతం దీనిని రెట్టింపు అనగా 10ని 20గా 20ని 40గా మార్పుచేయనున్నారు.

d) కాంట్రాక్టు లేబరు ఎబాలిషన్ యాక్టు

గతంలో 5 మంది పైబడి కార్మికులు పనిచేస్తే ఈ చట్టం వర్తించేది. ప్రస్తుతం ఈ సంఖ్యను 50గా మార్చనున్నారు.

e) అప్రెంటీసు

గతంలో కార్మికుల నైపుణ్యం పెంచడానికి స్టయిఫండ్ యిచ్చి పని నేర్పిస్తూ పని పర్యవేక్షణ చేస్తూ కంపెనీలో పర్మినెంటు చేసేవారు. కాగా, కాంట్రాక్టు, క్యాజువల్, రెగ్యులర్ బదులుగా అప్రెంటీసు యాక్టు క్రింద 70 శాతం అప్రెంటీసులను చేర్చుకోడానికి తాజా సవరణల్లో అవకాశం కల్పిస్తున్నారు.

f) ఓవరు టైము

గతంలో 3 నెలలలో 50 గంటలకన్నా ఎక్కువగా కార్మికులు ఓవర్‌టైము చెయ్యకూడదు అనే నిబంధన వుండేది. దీన్ని 100 గంటలుగా ఇప్పటికే మారిస్తే 150 గంటలు కూడా ఓవరుటైము చేయించడానికి ప్రభుత్వము చట్ట సవరణకు పూనుకుంటున్నది.

g) కనీస వేతనం

గతంలో కనీస వేతనంపై, ధరల పెరుగుదలపై వి.డి.ఏ పెంచేవారు. ప్రస్తుతం ధరలు పెరిగినా డి.ఏను ఇవ్వనవసరంలేదని చట్టసవరణకు పూనుకుంటున్నారు.

h) కార్మిక చట్టాలు

గతంలో 10 మంది పనిచేసేచోట రిజిష్టరు, వేజ్ స్లిప్, ఇతరత్రా సౌకర్యాలు అమలుచేయించేవిధంగా అధికారుల నియంత్రణలో ఉండగా ఇవన్నీ అవసరం లేదంటూ తొలగించే నిర్ణయం చేయనున్నారు.

i) మహిళా కార్మికులు

గతంలో సాయంత్రం 6 గం॥లు దాటిన తర్వాత మహిళా కార్మికులు ఫ్యాక్టరీలో పనిచేయడంపై నిషేధం ఉన్నప్పటికీ ఐటి రంగంలో రాత్రులు కూడా పనిచేయిస్తున్నారు. ప్రస్తుతం సమయ పరిమితి చట్టపరంగానే ఎత్తివేయబూనుకున్నారు.

j) కనీస వేతనం

1957లో అప్పటి ఉప ప్రధానమంత్రి గుల్జారీల్ నందా నాయకత్వాన డా॥ ఆక్వాయి ఫార్ములా ప్రకారం కార్మికులకు 2700/– క్యాలరీల ఆహారం, 20% ఇంటి అద్దె, పండగ దుస్తులకు 25% ఉండాలని నిర్ణయించింది. ఆ ప్రకారం ప్రస్తుతం కార్మికులకు రూ. 14,500 వేతనం కనీస వేతనంగా చెల్లించాలని–

**సంస్కరణలపేరిట ప్రభుత్వం చేపడుతున్న కార్మిక చట్టాలలో ఈ సవరణలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐఎఫ్‌టియు(న్యూ) అఖిల భారత సదస్సు డిమాండ్ చేస్తున్నది.**

2. ప్రభుత్వ, ప్రైవేటురంగాలలో కాంట్రాక్టీకరణ విధానాన్ని రద్దుచేయాలని –

3. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంటు చేయాలని –

4. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటినీ వెంటనే భర్తీ చెయ్యాలని,

5. మహిళా కార్మికులకు పనిచేసే చోట భద్రత పెంచాలని –

6. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీరప్రాంతాలలో ప్రవేశ పెట్టనున్న పెట్రోకెమికల్ పరిశ్రమలను ఉపసంహరించాలని –

7. కేంద్ర ప్రభుత్వం రక్షణ రంగంలో ఎఫ్‌డిఐల పేరిట విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను తీసుకురావడాన్ని వెంటనే ఉపసంహరించాలని –

8. రైల్వే, ఎల్‌ఐసి, ప్రభుత్వ రంగంలో ప్రవేశపెడుతున్న 49 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను వెనక్కి తీసుకోవాలని –

9. సామాన్య ప్రజలకు ఏమాత్రం ప్రయోజనం చేకూర్చని, సంపన్నుల ప్రయోజనాలకై ప్రవేశ పెడుతున్న బుల్లెట్ ట్రెయిన్స్‌కు వేలకోట్ల రూపాయలను కేటాయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, ఈ నిర్ణయాన్ని సత్వరమే ఉపసంహరించాలని –

10. బహుళజాతి కంపెనీల కోసం, గ్రామాలలో కనీసం సదుపాయాలు కల్పించకుండా స్మార్ట్ సిటీల పేరిట లక్షల కోట్ల రూపాయలను కార్పొరేటు కంపెనీలకు, బహుళజాతి కంపెనీలకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ –

11. రష్యా, జపాను వంటి దేశాలలోని అణువిద్యుత్ కేంద్రాలలో జరిగిన పెనుముప్పులు మన కళ్ళ ఎదుటే ఉండగా సామ్రాజ్యవాదుల ఆజ్ఞలకు తలవంచిన ప్రభుత్వాలు ఎక్కడికక్కడ అణువిద్యుత్ కేంద్రాలను నెలకొల్పడాన్ని తీవ్రంగావ్యతిరేకిస్తూ, వీటికి వ్యతిరేకంగా వెల్లువెత్తుతున్న ఉద్యమాలను బలపరుస్తూ –

12. అభివృద్ధి, సెజ్‌ల పేరుతో రైతుల నుండి బలవంతంగా భూములను గుంజుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ; పరిశ్రమల స్థాపన, సెజ్‌ల పేరిట, అభివృద్ధి పేరుతో పంట పొలాలను బలవంతంగా సేకరించే అన్నిరకాల విధానాలను వెంటనే రద్దుచేయాలంటూ–

13. ఆకాశాన్ని అంటుతున్న అన్నిరకాల నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని –

14. రైతు పండించిన పంటకు పంట ఖర్చులకు అనుగుణంగా న్యాయమైన గిట్టుబాటు ధర యివ్వాలని–

15. ఆదివాసీ నివాస ప్రాంతాలలో ఖనిజాలు, బాక్సైట్ తవ్వకాలను నిలుపుచేయాలని; గిరిజన ప్రాంతాలలో వారి హక్కుల పరిరక్షణకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకోవాలని –

16. దేశ దేశాలలో తమ న్యాయమైన హక్కులకై కూడు, గూడు, నీడ కొరకు పోరాడుతున్న కార్మికుల, వివిధ పీడిత ప్రజల ఉద్యమాలకు సంఘీభావం ప్రకటిస్తూ–

17. దేశ సంపదలను కొల్లగొట్టి మన దేశ ప్రజలందరికీ చెందాల్సిన లక్షల కోట్ల రూపాయలను దోపిడీ శక్తులు స్విస్ తదితర విదేశీ బ్యాంకులలో పోగేసుకున్నాయి. ఈ డబ్బును స్వాధీనపర్చుకోవాని, నల్లధనం నిల్వచేసిన శక్తులను శిక్షించాలని –

18. సామ్రాజ్యవాద దేశాల ప్రపంచ ఆధిపత్య వ్యూహాలలో భాగంగా భారతదేశ పాలకులు ఇరుగు పొరుగు దేశాలతో తరచూ విద్వేషాలను రెచ్చగొడుతూ సరిహద్దు తగాదాలను సృష్టిస్తున్నారు. కయ్యానికి కాలు దువ్వే కవ్వింపు చర్యలను మానుకోవాలని, భారత ప్రభుత్వం – ముఖ్యంగా వెనుకబడిన దేశాలతో, అభివృద్ధి చెందుతున్న దేశాలతో సహృద్భావంతో కూడిన పరస్పర యిచ్చిపుచ్చుకునే సంబంధాలు నెరపాలని, పాకిస్తాన్‌తో సహా ప్రపంచ ప్రజలకు శత్రువుగానున్న సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించే ఉండే విదేశాంగ విధానాన్ని అనుసరించాలని డిమాండ్‌చేస్తూ– **ఏఐఎఫ్‌టియు(న్యూ) అఖిల భారత సదస్సు తీర్మానాలను ఆమోదించింది.**

**భూమి సమస్య...**(8వ పేజీ నుండి)

చిన్నపాటి రోగాలకే అధిక సంఖ్యలో ఆదివాసులు మరణిస్తున్నారన్నారు.

ఆహారధాన్యాల సాగు విస్తీర్ణం తగ్గిపోవడం ఫలితంగా ఆహార ఉత్పత్తుల దిగుబడి తగ్గటమనేది ముఖ్యంగా మహిళల ఆరోగ్యంపై అధిక ప్రభావం చూపుతోందన్నారు.

నూతనంగా అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పోర్టులు, కారిడార్లు, సెజ్‌లకు భారీగా భూములు కట్టబెడుతోందని ఆయన పేర్కొంటున్నారు. వీరోచిత శ్రీకాకుళ పోరాట వారసత్వం కలిగివున్న ఈ ప్రాంత రైతాంగం, ఆదివాసులు, గ్రామీణ ప్రజలు, పీడిత ప్రజానీకమంతా అనుభవం కలిగిన సంఘ నాయకత్వంపై విశ్వాసముంచి ఉద్యమాలలో మరింతగా సంఘటితం కావాలని పిలుపునిస్తూ కె.ఆర్.చౌదరి స్ఫూర్తి దాయకమైన ప్రసంగం చేశారు.

**రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పిఐ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. అంజయ్య** మాట్లాడుతూ రాజులుపోయినా, రాజ్యాలు గతించినా, ఆ భూములు, సంపదలేవీ దళితులు, ఆదివాసులు, నిరుపేదల చేతులలోకి రాలేదన్నారు. దళితులు, గిరిజనుల అభ్యున్నతి గురించి చంద్రబాబునాయుడు ఆర్భాటపు ప్రకటనలైతే చేస్తున్నాడుగానీ, యస్‌సి యస్‌టి సబ్‌ప్లాన్‌కు నిధులు కేటాయించకపోగా బడ్జెట్ మొత్తాన్ని అగ్రకుల, సంపన్న, భూస్వామ్య, కార్పొరేట్లపరం చేస్తున్నాడన్నారు. వాస్తవానికి ప్రజలందరికీ భూమిపై హక్కు కల్పించి, సాగు అవసరాలు అందించి, వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తే ఈ ప్రభుత్వాలు 'రూపాయికి కిలో బియ్యం' పథకాలు ప్రవేశపెట్టాల్సిన అవసరంలేదని ఆయన అన్నారు. ప్రజల సమస్యలపై స్పందించి పనిచేసేవారందరూ ఒక వేదికపైకి రావాలసిన అవసరాన్ని అంజయ్య తన ఉపన్యాసంలో నొక్కి చెప్పారు.

**రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర అధ్యక్షులు కా॥ సింహాద్రి ఝాన్సి** మాట్లాడుతూ అనేక ఉద్యమాలు సాగించే క్రమంలోనే బొబ్బిలిలో సంఘం జిల్లా మహాసభలను జరుపుకుంటున్నామన్నారు. భూమి సమస్యపైన, కౌలుదార్ల హక్కుల కోసం, గిట్టుబాటు ధరల కోసం, వ్యవసాయ కూలీల వేతనాల పెంపు కోసం, సారాకు వ్యతిరేకంగా, భూస్వామ్య పెత్తందార్ల అత్యాచారాలకు వ్యతిరేకంగా, దళితులపై, ఆదివాసులపై దాడులకు వ్యతిరేకంగా నిరంతరాయ కార్యక్రమాలు సాగిస్తూ, ఈ క్రమంలో ఎన్నో అవాంతరాలు, అడ్డంకులు, పోలీసు కేసులు, నిర్బంధాలను ఎదుర్కొంటూ, అధిగమిస్తూ ముందుకు సాగే క్రమంలోనే ఈ సభలు నిర్వహించుకుంటున్నా మంటూ ఈ జిల్లా మహాసభల ఆవశ్యకత, ప్రాధాన్యతల గురించి ఆమె వివరించారు. గత జిల్లా మహాసభలలో ఒడిషా ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించి హాజరైన కేంద్రక అర్జున్, మావోయిస్టుదళం చేతిలో హత్యకు గురై ఈ సభలో లేకపోవటాన్ని; భూస్వాముల దాడిలో అమరుడైన జెన్ని తిరుపతి త్యాగాన్ని తొలుత గుర్తుచేసుకుంటూ అమరులందరికీ జోహార్లర్పించారు. గిరిజనుల, రైతాంగ ఉద్యమాలు క్లిష్ట సమస్యలను ఎదుర్కొనే ప్రతి సందర్భంలోనూ వారికి అండగా నిలుస్తూ వస్తున్న కె.ఆర్. చౌదరి, బి.డి. శర్మ, బొజ్జా తారకం తదితరులకు ఆమె అభివందనలు తెలిపారు. గిరిజనులు, దళితులు, మహిళలు, పేద రైతాంగం గౌరవప్రదమైన మంచి జీవితం కావాలంటే సంఘటిత పోరాటాలలో సమీకృతులవటం మినహా మరోమార్గం లేదని నొక్కిచెపుతూ, విజయనగరం జిల్లాలో మరింత సంఘటిత పీడిత ఉద్యమాల నిర్మాణానికి సంఘ నాయకత్వం, కార్యకర్తలు కార్యోన్ముఖులు కావాలని కామ్రేడ్ ఝాన్సి పిలుపునిచ్చారు.

ఇంకా ఈ ప్రారంభసభలో ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥ గణేష్‌పండా; ఏఐఎఫ్‌టియు(న్యూ) జిల్లా నాయకులు బెహర శంకర్రావు; కా॥ గోపాలం; గిరిజన సంఘ రాష్ట్ర నాయకులు కా॥ ఇల్లా రామిరెడ్డి; చాషీములియా సంఘ్(ఒడిషా) నాయకులు శ్రీకాంత్ మొహంతి; రైతుకూలీసంఘం(ఆం.ప్ర) శ్రీకాకుళం జిల్లా నాయకులు కా॥ తాండ్ర అరుణ; స్త్రీ విముక్తి సంఘటన నాయకులు గంటా అమ్మాజి; కళాసి సంఘం నాయకులు కా॥ బోగాది అప్పలస్వామి, రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) జిల్లా నాయకులు కా॥ బొత్స నర్సింగరావు, మోనంగి భాస్కరరావు, ఊయక ముత్యాలు, శ్రీనునాయుడు, కద్రక వెంకటస్వామి తదితరులు ప్రసంగించారు.

ఒడిషా నుంచి వచ్చిన చాషీములియా ఆదివాసీ సంఘం కళాకారులు ప్రదర్శించిన 'కిందిరి' నృత్య ప్రదర్శన, ప్రజాకళాకారుల 'డప్పు నృత్యం', బాల కళాకారుల 'కోలాటం', అమరుల త్యాగాలను గానం చేసే 'నెత్తుటి దీపాలు'; పీడిత ప్రజల విముక్తి బావుటా చరిత్రను వివరించే 'ఎర్రజెండా' కళారూపం; ప్రస్తుత రాజకీయాలపై వ్యంగ్యాన్ని సంధించిన 'సుద్దులు' తదితర ప్రదర్శనలు, కళారూపాలు మహాసభకు హాజరైన వేలాది ప్రజానీకంలో స్ఫూర్తి నింపాయి. జిల్లా నలుమూలల నుండి వేలాదిమంది గిరిజనులు, రైతుకూలీ ప్రజానీకం ఈ మహాసభకు హాజరయ్యారు.

## ప్రదర్శన

ప్రారంభసభ అనంతరం సాయంత్రం 5 గంటలకు పాతకోట మైదానం నుండి ప్రారంభమైన ప్రజా ప్రదర్శనతో బొబ్బిలి వీధులు కిక్కిరిసిపోయాయి. పట్టణ ప్రజలు బారులుతీరి ప్రదర్శనను ఆశ్చర్యంగా తిలకించారు. దశాబ్దాల అనంతరం బొబ్బిలిలో ఎర్రజెండాల మహా ప్రదర్శన జరిగినట్లుగా బోగాది అప్పలస్వామి, తదితర వృద్ధులైన కామ్రేడ్స్, ప్రజానీకం అభిప్రాయపడ్డారు. ఎర్రజెండాలు, బ్యానర్లు, ప్లకార్డులతో పాటు ప్రజా కళాకారుల బృందాలు ప్రదర్శనకు ముందుభాగాన ప్రదర్శించిన కిందిరి, చుట్టుకాముడు వంటి రూపకాలు బొబ్బిలి పట్టణవాసులను విశేషంగా ఆకర్షించాయి. క్రమశిక్షణాయుతంగా దాదాపు గంటకు పైగా సాగిన ఈ ప్రదర్శన అగ్రభాగాన సంఘం జిల్లా నాయకత్వంతోపాటుగా రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఝాన్సి, ప్రొఫెసర్ కె.ఆర్. చౌదరి తదితరులు ఆసాంతం ప్రదర్శనలో పాల్గొన్నారు.

## ప్రతినిధుల సభ

30-9-14న పాతకోట మైదానం ప్రక్కనే వున్న హాల్‌లో ప్రతినిధుల సభ జరిగింది. ఈ సభకు కామ్రేడ్స్ గుంపు ఎర్రిస్వామి, బొత్స నర్సింగరావు, కద్రక వెంకటస్వామి అధ్యక్షవర్గంగా వ్యవహరించారు.

ఈ సదస్సులో రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షురాలు కా॥ ఝాన్సి మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి, టిడిపి, ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను సోదాహరణంగా వివరించారు. హిందూ మతతత్త్వ ధోరణులను ప్రజా జీవనంలోని అన్ని పార్శ్వాలలోకి ప్రవేశపెడుతున్న పాలకుల విధానాలపట్ల అప్రమత్తతతో నుండి వాటిని తిప్పికొట్టాలన్నారు. ప్రజలపై భారాల పెంపు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు ఆమోదం, ప్రభుత్వరంగ సంస్థలను విడతలవారీగా అమ్మకం, కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాచివేస్తూ కార్మిక చట్టాలలో సవరణలు, 'జన్‌ధన్ యోజన' వంటి పేర్లతో ప్రజలను భ్రమలలో ముంచే విధానాలు, భూములను బడా సంపన్నవర్గాలకు నిరాటంకంగా కట్టబెట్టడం, జాతీయ దురభిమానాన్ని పెంచిపోషించటం వంటి ఎన్‌డిఏ ప్రభుత్వ విధానాలన్నీ గత యుపిఏ ప్రభుత్వ, సామ్రాజ్యవాద భూస్వామ్య ప్రయోజనాలకు లోబడిన విధానాల కొనసాగింపేతప్ప వేరు కాదన్నారు. బొబ్బిలిలో ఎన్‌సిఎస్ చక్కెర ఫ్యాక్టరీ యాజమాన్యం కార్మికుల శ్రమను దోచుకుని సంపదలు పోగేసుకోవటంతోపాటు, మిల్లుకు చెరకు తోలిన రైతులకు బకాయిలు చెల్లించకుండా మొండికేస్తున్నదని, దీనికి వ్యతిరేకంగా కార్మికులతో కలిసి రైతుకూలీసంఘం సాగిస్తున్న ఆందోళనను వివరించారు. మనదేశంలోని అర్ధవలస, అర్ధఫ్యూడల్ వ్యవస్థ మార్పుకోసం కార్మికవర్గ నాయకత్వాన కార్మిక రైతాంగ మైత్రి పునాదిగా దున్నేవానికే భూమి కేంద్ర నినాదంగా ఇతర పీడితవర్గ ప్రజానీకంతో కలసి నూతన ప్రజాస్వామిక వ్యవస్థ ఏర్పాటు చేయటం ద్వారానే నిజమైన అర్ధంలో ప్రజల హక్కులకు గ్యారంటీ ఏర్పడుతుందని, అందువలన రైతు, కూలీ, ఆదివాసీ, గ్రామీణ ప్రాంత పేదల సమైక్య ఉద్యమాలన్నీ ఈ దిశగా ఎక్కుపెట్టబడాలనే లక్ష్యాన్ని పునరుద్ఘాటిస్తూ, దిశా నిర్దేశం చేస్తూ కా॥ ఝాన్సి తన ప్రసంగం ముగించారు.

ఈ సదస్సులో **ప్రొఫెసర్ కె.ఆర్. చౌదరి** ప్రతినిధులను విజ్ఞానవంతం చేసే ఉపన్యాసం చేశారు. భారతదేశంలో గతంకంటే వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతున్నప్పటికీ ఆ అభివృద్ధి ఫలాలు ఏవీ ప్రజలకు, వ్యవసాయదారులకు అందటంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'ఒకనాటి 5 కోట్ల టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి, ఈనాడు 25 కోట్ల టన్నులకు పెరిగింది; వాణిజ్య పంటలలో 3 రెట్లు ఉత్పత్తి పెరిగింది; పాల ఉత్పత్తిలో, పంట ఉత్పత్తిలో భారతదేశం అగ్రస్థానంలో వుంది; కూరగాయల ఉత్పత్తిలో 2వ స్థానంలో వుంది. భాక్రానంగల్, సాగర్ వంటి ప్రాజెక్టుల ద్వారా బీడు భూములు పెద్దఎత్తున సాగులోకి వచ్చాయి. వీటన్నింటితో అభివృద్ధి జరిగింది నిజమేమో అనే భ్రమలకు లోనవుతాం.

కానీ వాస్తవానికి గత ఆరు దశాబ్దాలపైగా కాలంలో కూడా వ్యవసాయ యోగ్యమైన భూములలో సగానికి పైగా సాగు చేయబడకుండా వుందని అమెరికా శాస్త్రవేత్తలే చెబుతున్నారు. ఇన్ని డ్యాములు కట్టామంటున్నా, ఇంకా మన దేశంలో వ్యవసాయం ప్రధానంగా వర్షాధారంగానే వుంది. సంస్థాగత రుణ సౌకర్యం 20-25 శాతం రైతులకేమన్నా ఉపయోగ పడుతుందేమో తప్ప, రైతాంగం అధికంగా ప్రైవేటు అప్పులపై ఆధారపడవలసి వస్తోంది. మార్కెట్లు దళారుల చేతుల్లో ఉన్నాయి. మద్దతు ధరలనేవి - ప్రకటించిన మేరకు కూడా అమలుకావు. కనుక, జరిగిందంటున్న అభివృద్ధి అంతా పై వర్గాలకు తోడ్పడింది తప్ప, రైతాంగానికి అందనేలేదని స్పష్టమౌతోంది.

గ్రామీణ ప్రాంతాల నుండి వలసలు సాగుతున్నాయి. వ్యవసాయ కూలీలు, దళితులు, రైతుకూలీలు 3 లక్షల మందికిపైగా ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వ్యవసాయరంగమే అభివృద్ధి అయివుంటే వ్యవసాయాన్ని ఎందుకు వీడిపోతారు? ఎందుకు ఆత్మహత్యలకు పాల్పడతారు?

మన రాష్ట్రంలో ఎక్సైజు పన్ను ద్వారా 15 వేల కోట్ల ఆదాయం ప్రభుత్వానికి వస్తోంది. పొగాకు ద్వారా 3 వేల కోట్లు, మార్కెట్టు యార్డుల ద్వారా 500 కోట్లు, రైతుబజార్ల ద్వారా 150 కోట్లు ప్రభుత్వాదాయం వస్తోంది. కానీ ఈ ఆదాయం నుండి రైతాంగ సంక్షేమానికి కనీసంగా వెచ్చించటంలో ప్రభుత్వాలు ఘోర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి.

వ్యవసాయం అభివృద్ధి చెందాలంటే వ్యవసాయంలో నూతన పరిశోధనలు జరగాలని, సాంకేతిక విజ్ఞానం పెరగాలని ఇక్రిసాట్ శాస్త్రవేత్తలు, పాలకులు అంటున్నారు. వ్యవసాయ పరిశోధనా సంస్థలలో సాంకేతిక అభివృద్ధి సాధించాల్సిన అవసరం వుంది. అయితే ఈ పరిశోధనల పట్ల ప్రభుత్వాలకు ఆసక్తి లేదు; వాటికి కనీసంగా నిధులు కేటాయించటం లేదు; పైగా విదేశీ నిధులతో ఆయా దేశాలు తమ ప్రయోజనాలకవసరమైన పరిశోధనలను మన శాస్త్రవేత్తలతో సాగిస్తూండటం విషాదం.

మన దేశంలో వర్షాభావానికి తట్టుకోగలిగే వంగడాలపై పరిశోధనలు సాగాలి; సుస్థిర సేంద్రియ పద్ధతులపై పరిశోధనలు సాగాలి; లక్షల కోట్ల రూ॥ విలువచేసే పూత రాలిపోతున్నది. దీనిని నిరోధించే పరిశోధనలు సాగాలి; జొన్నలు, రాగులు, సజ్జలు, కొర్రలు తదితర అపరాల ఉత్పత్తిపై పరిశోధనలు సాగటంలేదు. పైగా మూల విత్తనాలను ప్రైవేటు కంపెనీలు దొంగిలించి, విత్తనాలను వారే ఉత్పత్తిచేసి అధిక ధరలకు అమ్ముకుంటూ లాభాలు గడిస్తున్నారు. వ్యవసాయరంగంలో రైతులకు అనుకూలమైన 100 ఆవిష్కరణలు జరిగితే అందులో 10, 15 మాత్రమే రైతులకు చేరుతున్నాయి. రైతులకు వ్యవసాయ సూచనలందించే వ్యవసాయ విస్తరణాధికారుల పోస్టులన్నీ ఖాళీగా వున్నాయి.

సామ్రాజ్యవాదం, బహుళజాతి కంపెనీలు, దేశ పాలకులు కార్పొరేటు, కాంట్రాక్టు వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారు. వరి, కందులు, ఉల్లి, వంగ వంటి వాటిల్లో వేల రకాల వైవిధ్యమున్న రకాలను తమ గుప్పెటలోపెట్టుకున్న మాన్‌శాంటో వంటి ఎమ్ఎన్‌సిలు విత్తనరంగాన్ని శాసిస్తున్నాయి. జన్యుమార్పిడి విత్తనాలలో 90 శాతం మాన్‌శాంటో చేతుల్లో ఉన్నాయి. పేటెంటు హక్కుల పేరిట రాయల్టీలు పొందుతున్నారు. మనదేశం స్వయం సమృద్ధిగా వున్న వంటనూనెలు, పాలు, పండ్లను కూడా నిర్బంధంగా దిగుమతి చేస్తున్నారు. దిగుమతి సుంకాలు రద్దుచేస్తున్నారు.

2013లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన భూసేకరణ - పునరావాస చట్టం రైతులకు, ఆదివాసులకు తోడ్పడేది కాదు. పరిశ్రమలు, విమానాశ్రయాలు, సెజ్‌లు, మౌలిక సదుపాయాలు, పట్టణీకరణ, గ్యాస్ వెలికితీత, గనులు, రియల్‌ఎస్టేట్స్, ప్రాజెక్టులు, వ్యాపార వాణిజ్య సముదాయాలు తదితర రూపాలలో బడా, బహుళజాతి కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే!

ఈ నేపధ్యంలో పాలకుల రైతాంగ వ్యతిరేక విధానాలను వాటి మూలాలను సమగ్రంగా అర్ధం చేసుకుని, రైతు, కూలీ, ఆదివాసీ ఉద్యమాలను చైతన్యయుతంగా, నిర్మాణయుతంగా, సమరశీలంగా నిర్మించాలని ప్రొఫెసర్ కె.ఆర్.చౌదరి రైతాంగ ఉద్యమ ప్రతినిధులకు పిలుపునిచ్చారు.

గత మహాసభల నుండి ప్రస్తుత సభల మధ్యకాలంలో రైతాంగ సమస్యలపైన, వ్యవసాయ కూలీల కూలిరేట్ల సమస్యపైన, 1/70 అమలుకోసము, ఏజెన్సీ గ్రామాలను షెడ్యూల్డు ఏరియాలో చేర్చాలని, ఐటిడిఏ అక్రమాలకు వ్యతిరేకంగా, ప్రజావ్యతిరేక కోటిపాం థర్మల్ విద్యుత్తు కేంద్రానికి వ్యతిరేకంగా, దళితులు, ఆదివాసులపై దాడులకు, మహిళలపై అత్యాచారాలకు వ్యతిరేకంగా, ఎస్‌టిఎమ్ భూముల పునఃస్వాధీనానికి, అక్రమ మైనింగ్‌కు వ్యతిరేకంగా, బాక్సైట్ తవ్వకాలను నిరసిస్తూ విస్తారంగా ప్రజలను సమీకరించి జిల్లా వ్యాపితంగా సాగించిన కార్యక్రమాలను, ఈ క్రమంలో సంఘకార్యకర్తలు, నాయకత్వం, ప్రజలపై సాగిన దాడులు, అక్రమకేసులు, నిర్బందాలను, వీటిని అధిగమిస్తూ సంఘ నిర్మాణాన్ని పటిష్టం చేసుకుంటూ ముందుకు సాగుతున్న క్రమాన్ని... సంఘం జిల్లా కార్యదర్శి కా॥ డి. వర్మ వివరించారు. దానిని పరిపుష్టం చేస్తూ వివిధ మండలాల నుండి కామ్రేడ్స్ మాట్లాడారు.

కా॥ డి. వర్మ కార్యదర్శిగా కా॥ ఊయక ముత్యాలు అధ్యక్షులుగా జిల్లా కార్యవర్గాన్ని మహాసభ ఎన్నుకుంది. 1/70 చట్టాన్ని సక్రమంగా అమలుచేయాలని, ఐటిడిఏ అక్రమాలను అరికట్టాలని, రైతాంగ రుణమాఫీతోపాటు కౌలు రైతులతోసహా సంస్థాగత రుణాలందించాలని, బొబ్బిలి చెరకు రైతులకు ఎన్‌సిఎస్ యాజమాన్యం బకాయిలను చెల్లించాలని, సంఘం కార్యకర్తలు, నాయకత్వంపై మోపిన అక్రమకేసులను ఎత్తివేయాలని, రణస్థలంలో అణు విద్యుత్తు కేంద్రనిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ పలు తీర్మానాలను ఈ సభలో ఆమోదించారు. రెండురోజుల సభల నిర్వహణకు అన్నివిధాలా సహకరించిన వారందరికీ జిల్లా కార్యవర్గం కృతజ్ఞతలు తెలియపరిచింది. ✡

# విప్లవ కార్మికోద్యమ నాయకుడు కామ్రేడ్ ఎన్.వి.కృష్ణయ్య వర్ధంతి సభ



కా॥ఎన్.వి.కృష్ణయ్య వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న కా॥ వి.కిషోర్

**బావుపాడు, 21-9-14 :**

కరీంనగర్ జిల్లా బావుపాడులో 21-9-14న ఏఐఎఫ్‌టియు(న్యూ) అనుబంధ కరీంనగర్ జిల్లా గ్రానైట్ అండ్ క్వారీ, క్రషర్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో, బావుపాడులోని సంఘం కార్యాలయంలో అమరుడు కామ్రేడ్ ఎన్.వి.కృష్ణయ్య 8వ వర్ధంతి సభ జరిగింది. ఈ సభలో ఏఐఎఫ్‌టియు(న్యూ) అనుబంధ యూనియన్ల నాయకులు కామ్రేడ్ ఎన్.వి. కృష్ణయ్యకు విప్లవ జోహార్లు అర్పించారు.

2006 సెప్టెంబరు 13న అమరుడైన కామ్రేడ్ ఎన్.వీ.కే 8వ వర్ధంతి సభను కార్మికోద్యమ శక్తులు మరింతగా ఐక్యమౌతున్న స్థితిలో జరుపుకొంటున్నాం అని వక్తలు వివరించారు. యూనియన్ అధ్యక్షుడు, ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కామ్రేడ్ వి. కిశోర్ కామ్రేడ్ ఎన్.వీ.కే. విద్యార్థి దశ నుండి రాజకీయాల్లోకి వచ్చిన క్రమాన్ని వివరించారు. కమ్యూనిస్టుగా, కమ్యూనిస్టు విప్లవకారుడుగా చివరి వరకూ విప్లవ నిబద్ధతతో నిలిచిన నాయకుడని వివరించారు. కార్మిక నాయకుడిగా వివిధ యూనియన్‌లను నిర్మించి నాయకత్వం వహించారని వివరించారు. బీడీ కార్మికులకు (తరువాయి 3వ పేజీలో)

# 'నూతన ప్రజాస్వామిక విప్లవానికి నాయకత్వం వహించే చారిత్రక కర్తవ్యం కార్మికవర్గం మీదే వుంది'

## - ఏఐఎఫ్‌టియు(న్యూ) అఖిలభారత సదస్సులో కా॥అరవిందసిన్హా



అఖిలభారత కార్మిక సదస్సులో ప్రారంభోపన్యాసం చేస్తున్న బొజ్జా తారకం, ప్రక్కన జి. విజయకుమార్; కె.ఆర్. చౌదరి, అరవింద సిన్హా, జస్వంతరావు, సుభోద్‌మిత్రా, ఎస్.ఝూన్సి; సదస్సుకు హాజరైన కార్మిక ప్రజానీకం

**హైదరాబాద్, అక్టోబర్ 11, 12 తేదీలు :** 'దోపిడీ, అణచివేతల వ్యవస్థ–భారత పాలకుల పరాధీన విధానాలు–ప్రస్తుత సామాజిక ఆర్థికవ్యవస్థ మార్పులో కార్మికవర్గ చారిత్రకపాత్ర' అనే కేంద్ర అంశంపై ఏఐఎఫ్‌టియు(న్యూ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో రెండురోజుల అఖిలభారత కార్మిక సదస్సు జరిగింది.

సదస్సు మొదటి రోజున ఉ॥11 గం॥కు స్థానిక ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద వేలాదిగా హాజరైన కార్మిక, ప్రజానీకంతో ప్రారంభసభ జరిగింది. ఏఐఎఫ్‌టియు (న్యూ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కా॥సి. పెద్దన్న వేదికపైకి వక్తలను ఆహ్వానించగా, ఏఐఎఫ్‌టియు(న్యూ) అధ్యక్షులు కామ్రేడ్ జి. విజయకుమార్ ఈ ప్రారంభసభకు అధ్యక్షత వహించారు. తొలుత ఏఐఎఫ్‌టియు(న్యూ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ గణేష్‌పండా దేశంలోనూ, అంతర్జాతీయంగా వ్యవస్థమార్పుకోసం, కార్మిక, ప్రజాఉద్యమాలలో మరణించిన వారందరికీ జోహార్లు తెలుపుతూ సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. ప్రత్యేకించి కర్ణాటక రాష్ట్ర కార్మిక నాయకులు కా॥మాస్టార్జీ, కార్మికోద్యమమిత్రులు ఎం.టి.ఖాన్‌లకు; తమిళనాడులో గూండాల చేతులలో హతులైన భాస్కర్, కుమార్‌లకు; ఇజ్రాయిల్ దాడులలో ప్రాణాలు కోల్పోతున్న పాలస్తీనా ప్రజలకు జోహార్లర్పిస్తూ సభికులంతా లేచినిలబడి 2 నిమిషాలు మౌనం పాటించారు.

సమాజం నేడున్న సంక్లిష్ట పరిస్థితులలో కార్మిక, ప్రజానీకానికి దిశానిర్దేశం చేయటానికి, కార్మికవర్గ కర్తవ్యాలను పునశ్చరణ చేసుకొనేందుకు ఏఐఎఫ్‌టియు(న్యూ) ఈ అఖిలభారత కార్మిక సదస్సును నిర్వహిస్తోందని కా॥జి.విజయకుమార్ తన అధ్యక్షోపన్యాసంలో పేర్కొన్నారు.

ప్రారంభ సభలో మొదటగా **కార్మికోద్యమ మిత్రులు, దళిత ఉద్యమ నాయకులు, సీనియర్ హైకోర్టు న్యాయవాది బొజ్జాతారకం** మాట్లాడుతూ శ్రమజీవులకు జీవించేహక్కులేకుండా చేస్తున్న పాలకుల ఏలుబడిలో తమ హక్కులకై ఎలుగెత్తిచాటుతూ కార్మికులను సమీకరించి ఏఐఎఫ్‌టియు(న్యూ) అఖిల భారత స్థాయిలో సదస్సును నిర్వహిస్తున్నందుకు అభినందనలు తెలియజేశారు. ప్రజల హక్కులను కాలరాచివేస్తున్న పాలకులకు వ్యతిరేకంగా గొంతెత్తటమే నేరమైన ఈ వ్యవస్థలో పాలకులు తమ స్వీయ, స్వార్ధ ప్రయోజనాలే గీటురాయిగా పాలన సాగిస్తున్నారన్నారు. కార్మికవర్గం అశేష త్యాగాలుచేసి సంపాదించుకున్న కనీసపాటి హక్కులను కూడా తొలగించివేసేందుకు ఎన్‌డిఏ పాలకులు నడుం బిగించారన్నారు. కార్మిక సంఘాల నిర్మాణానికి అనుమతినివ్వటంలేదు; సమ్మెలను నిషేధిస్తున్నారు; కాంట్రాక్టు కార్మిక విధానంతో కార్మికులను ఐక్యంగానీయకుండా విచ్చలవిడిగా శ్రమదోపిడీ సాగిస్తూ యాజమాన్యాలు సంపదలను పోగేసుకుంటున్నాయన్నారు. కాంట్రాక్టు కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా అత్యవసరంగా ఒక పెద్ద ఉద్యమం జరపాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. ఇందుకు కార్మికుల సంక్షేమంకోసం కృషి సల్పుతున్న సంఘాలన్నీ ఐక్యంగా ముందుకు కదలాలన్నారు.

1947లో ఉన్నత కులాలకు, ధనికవర్గాలకు, భూస్వాములకు, పెట్టుబడిదారులకు మాత్రమే స్వాతంత్ర్యం వచ్చిందని, బడుగు, బలహీనవర్గాలు, నిరుపేద, దళిత, ఆదివాసీ ప్రజానీకం ఈనాటికీ దుర్భర జీవనాన్ని సాగిస్తున్నారని వివరించారు. బ్రతికే హక్కును కాలరాస్తున్న ఈ పాలకుల పాలనకంటే నాటి బ్రిటిష్‌పాలనే బాగుందనిపించేంత ఘోరంగా పరిస్థితి దిగజారిందన్నారు.

ఆస్థిపరుల రక్షణకోసమే ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ, చట్టాలు, న్యాయవ్యవస్థ, పాలనా యంత్రాంగం, పనిచేస్తున్నాయన్నారు. జీవించి వుండాలంటే హక్కుల గురించి నోరెత్తవద్దని హెచ్చరిస్తున్న పాలకులు, ప్రజలను పురుగులకంటే హీనంగా చూస్తున్నారని, ఈ వ్యవస్థ స్వభావాన్నీ, పాలకుల దోపిడీ విధానాలను కార్మికవర్గం, ఇతర ప్రజానీకం సమగ్రంగా అవగాహన చేసుకొని కార్మికుల, ప్రజల హక్కుల పరిరక్షణకోసం అఖిలభారత స్థాయిలో ఉద్యమాన్ని నిర్మించాల్సిన ఆవశ్యకతను బొజ్జాతారకం తన ఉపన్యాసంలో నొక్కి చెప్పారు.

**ఏఐఎఫ్‌టియు(న్యూ) ప్రధానకార్యదర్శి కా॥ అరవింద సిన్హా** మాట్లాడుతూ కార్మికులు వారి

(తరువాయి 6వ పేజీలో)

# 'భూమి సమస్య - అస్తిత్వం, ఆత్మగౌరవానికి సంబంధించిన అంశం; భూమి కేంద్రంగా రైతు, కూలీ, గ్రామీణ పేదల, ఆదివాసుల పోరాటాలు సాగాలి'

## - రైతుకూలీసంఘం(ఆం.ప్ర) విజయనగరంజిల్లా మహాసభలో ప్రొ॥ కె. ఆర్. చౌదరి ఉద్ఘాటన



రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) విజయనగరం జిల్లా మహాసభలో అమరులకు జోహార్లర్పిస్తున్న వక్తలు; సభకు హాజరైన రైతుకూలీ, ఆదివాసి ప్రజానీకం; ప్రజా కళాకారుల డప్పు నృత్యం

**బొబ్బిలి, సెప్టెంబర్ 29, 30 తేదీలు :** విజయనగరం జిల్లా బొబ్బిలిలోని పాత కోట మైదానంలో రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా మహాసభలు సెప్టెంబర్ 29, 30 తేదీలలో విజయవంతంగా జరిగాయి.

29వతేదీ మధ్యాహ్నం **రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి కా॥ డి. వర్మ** వేలాదిమంది రైతు, కూలీలు, ఆదివాసుల సమక్షంలో రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) జెండాను ఎగురవేసి, అనంతరం జరిగిన ప్రారంభసభకు అధ్యక్షత వహించారు. సంఘం జిల్లా కోశాధికారి కా॥ శ్రీనునాయుడు గత మహాసభ నుండి ఈమధ్య కాలంలో ప్రజా ఉద్యమాలలోనూ, ప్రజాతంత్రవాదులుగానూ మృతిచెందినవారందరికీ జోహార్లు చెబుతూ సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. అమరులకు గౌరవ సూచకంగా మహాసభకు హాజరైన ప్రజానీకమంతా లేచి నిలబడి రెండు నిముషాలు మౌనం పాటించారు.

కా॥ వర్మ తన అధ్యక్షోపన్యాసంలో జిల్లా రైతు, కూలీ, ఆదివాసుల, కౌలు రైతుల స్థితిగతులను వివరించటంతోపాటు, ఆయా సెక్షన్ల ప్రజల సమస్యలపై జిల్లాలో గత 24 సం॥ల నుండి సంఘం ఆధ్వర్యంలో విస్తృతంగా కృషి సాగిస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలో దాడులు, అరెస్టులు, నిర్బంధాలనన్నింటినీ తట్టుకొని, అధిగమిస్తూ ముందుకు వెళుతున్నామన్నారు. పాలకుల, దోపిడీశక్తులపట్ల సరైన అంచనా, స్పష్టమైన వైఖరి, విధానాలతో సంఘాన్ని పోరాట మార్గాన అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని తెలియ చేశారు.

**ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ కె.ఆర్. చౌదరి** ప్రారంభోపన్యాసం చేస్తూ గత రెండున్నర దశాబ్దాలుగా అనేక పోరాటాలు సాగిస్తూ వస్తున్న రైతుకూలీసంఘంతోనూ, ప్రత్యేకించి విజయనగరం జిల్లా ఉద్యమంతోనూ తన అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. జన్ని తిరుపతి మరణం తన తలపులలో నిలిచే వుందంటూ భూమి సమస్యను అస్తిత్వం, ఆత్మగౌరవానికి సంబంధించిన కీలకాంశంగా పేర్కొంటూ భూమి కేంద్రంగా రైతుకూలీ, గ్రామీణ పేదల, ఆదివాసుల ఉద్యమాలు సాగాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

భూమి సమస్యపై ఆయన ప్రధానంగా మాట్లాడుతూ రైతుల భూములు అత్యధికం పరాధీన మవటంపట్ల ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల చేతులలోని భూములు, ప్రభుత్వం దళితులకు ఇచ్చిన భూములు అన్యాక్రాంతమయ్యాయని, భూగరిష్టపరిమితి చట్టం నిరుపయోగంగా మారిపోయిందని, 1/70 చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని, కౌలు రైతుల చట్టం ఎక్కడా అమలుకావటంలేదని ఆయన పేర్కొన్నారు. ప్రజలు లేదా రైతాంగం ఎక్కడైతే కదిలి ఆందోళనలు సాగిస్తారో, ఏదోమేరకు అక్కడ మాత్రమే ఈ చట్టాలను అమలు చేయించుకోగలుగుతున్నా రన్నారు.

రైతాంగానికి మరో ముఖ్యమైన సాగునీటి గురించి ఆయన మాట్లాడుతూ సాగునీటి సరఫరాలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా విమర్శించారు. చిన్న రిజర్వాయర్లు నిర్మించి, చిన్న నీటి సదుపాయాలతో, అత్యంత తక్కువ సాగునీటి వసతి వున్న విజయనగరం జిల్లాలో సాగునీరు అందించే అవకాశమున్నప్పటికీ ప్రభుత్వాలు ఆవైపుగా దృష్టి సారించటంలేదని పేర్కొంటూ జంఝావతి, తోటపల్లి ప్రాజెక్టులను ఆయన ఉదహరించారు.

హరిత విప్లవంతో పాలకులు రసాయన ఎరువుల వాడకం పెంచి, వ్యవసాయం ఖర్చులు పెంచి, ఆపై సబ్సిడీలన్నింటినీ దిగ్గోసి, రైతాంగాన్ని రుణభారాల ఊబిలోకి నెట్టివేసిన క్రమాన్ని ఆయన వివరించారు. పెరిగిన సాగు ఖర్చులకనుగుణంగా మద్దతు ధరలు కల్పించకుండా మార్కెట్ శక్తులకు రైతాంగాన్ని వదిలివేయటంతో, పంటలకు కనీస ధరలు లభించక దిక్కుతోచక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆయన చెప్పారు.

ఆదివాసులు సేకరించిన అటవీ ఉత్పత్తుల కొనుగోలులో దోపిడీ జరుగుతోందని, మరోవైపున ఆదివాసీ ప్రాంతాలలో కనీస వైద్య సౌకర్యం లేక

(తరువాయి 7వ పేజీలో)

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010